www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

సంపుటి:13 సంచిక: 103
హైదరాబాద్ సోమవారం, 02.02.2026
www.mudranews.in | @mudranews
పేజీలు: 12 వెల: రూ. 5
Published From: Hyderabad


## బడ్జెట్ 2026: ఏ రంగానికి ఎంత?

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కాసేపటి క్రితం పార్లమెంట్‌లో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతేడాదితో పోలిస్తే ద్రవ్యలోటు 0.1 శాతం తగ్గినట్టు మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 4.3 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే రాబోయే ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లు రూ.28.70 లక్షల కోట్లు అని అంచనా వేశారు. ఇక, మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు అని పేర్కొన్నారు

| | |
|---|---|
| రవాణా రంగం: | రూ.5,98,520 కోట్లు |
| రక్షణ రంగం: | రూ.5,94,585 కోట్లు |
| గ్రామీణాభివృద్ధి: | రూ.2,73,108 కోట్లు |
| హోంశాఖ: | రూ.2,55,234 కోట్లు |
| వ్యవసాయం: | రూ.1,62,671 కోట్లు |
| విద్యా రంగం: | రూ.1,39,289 కోట్లు |
| ఇంధన రంగం: | రూ.1,09,029 కోట్లు |
| ఆరోగ్య రంగం: | రూ.1,04,599 కోట్లు |
| పట్టణాభివృద్ధి: | రూ.85,522 కోట్లు |
| కామర్స్ అండ్ ఇండస్ట్రీ: | రూ.70,296 కోట్లు |
| సోషల్ వెల్ఫేర్: | రూ.62,362 కోట్లు |
| సైంటిఫిక్ డెవలప్‌మెంట్: | రూ.55,756 కోట్లు |
| ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్: | రూ.45,500 కోట్లు |
| విదేశీ వ్యవహారాలు: | రూ.22,119 కోట్లు |
| ఫైనాన్స్: | రూ.20,649 |
| ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి: | రూ.6,812 కోట్లు |

### నిర్మలా సీతారామన్ రికార్డ్

ముద్ర, ఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో వరుసగా 9వ సారి బడ్జెట్ ను సమర్పించిన తొలి ఆర్థిక మంత్రిగా చరిత్రలో నిలిచారు. 2019, మే 31న పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమె, 2026, జనవరి 31 నాటికి 6 సంవత్సరాల 8 నెలల సేవాకాలాన్ని పూర్తి చేయనున్నారు. దీంతో దేశంలోని దీర్ఘకాలిక ఆర్థిక మంత్రుల జాబితాలో ఆమెకు విశేష స్థానం దక్కింది. ఇంతకు ముందు మొరార్జీ దేశాయ్ మొత్తం 10 సార్లు, పి. చిదంబరం 9 సార్లు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా వరుసగా 9 సార్లు ఈ ఘనత సాధించినవారు లేరు.




**ధరలు తగ్గేవి**

- క్యాన్సర్ డ్రగ్స్
- డయాబెటిస్ మెడికేషన్స్
- లెదర్ ప్రొడక్ట్స్
- స్మార్ట్ ఫోన్స్
- సీఫుడ్
- ఈవీ బ్యాటరీలు
- స్పోర్ట్స్ ఎక్విప్ మెంట్
- సోలార్ ప్యానెల్స్
- మైక్రోవేవ్ ఓవెన్స్
- లిథియం బ్యాటరీ కాంపోనెంట్స్
- ఎయిర్ క్రాఫ్ట్ పార్ట్స్

**ధరలు పెరిగేవి..**

- విదేశీ మద్యం ఆల్కహాల్
- లగ్జరీ వాచ్‌లు
- పొగాకు ఉత్పత్తులు
- సిగరెట్, పాన్ మసాలా



## మౌలిక విప్లవం..

# టెక్నాలజీకి పట్టాభిషేకం

**వరుసగా 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన నిర్మలమ్మ**

**ముద్ర, ఢిల్లీ:** కేంద్ర బడ్జెట్ 2026-27ను పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. కీలక రంగాల అభివృద్ధే లక్ష్యంగా కీలక ప్రకటనలు చేశారు. హైస్పీడ్ రైల్ కారిడార్లు, పన్ను మినహాయిపులు, ఫ్యూచర్స్ ట్రేడింగ్ పై పన్ను పెంపు వంటి కీలక అంశాలు ఉన్నాయి. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. వరుసగా 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డ్ సృష్టించారు. దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, సబ్ కా మిగతా 02లో

- మౌలిక వసతుల అభివృద్ధికి క్యాపెక్స్‌లో భారీ పెంపు
- పన్ను స్లాబ్‌లలో మార్పుల్లేవు.. వేతన జీవులకు దక్కని ఊరట
- దేశవ్యాప్తంగా 7 హైస్పీడ్ రైలు కారిడార్లకు గ్రీన్ సిగ్నల్
- కార్పొరేట్, మున్సిపల్ బాండ్ మార్కెట్‌కు కొత్త ఊపిరి
- బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి హై లెవల్ కమిటీ
- ఎన్నారై పెట్టుబడుల పరిమితులు పెంచి విదేశీ నిధులకు ఆహ్వానం
- ఫిస్కల్ డెఫిసిట్ నియంత్రణలో ప్రభుత్వం స్పష్టమైన దిశ
- ఫ్యూచర్స్ & ఆప్షన్స్‌పై ఎస్‌టిటి పెంపుతో ట్రేడర్లకు దెబ్బ
- మెడికల్ టూరిజం హబ్‌లతో భారత్‌కు గ్లోబల్ హెల్త్ ఫోకస్
- క్లౌడ్, డేటా సెంటర్లకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే

# కొంత ఊరట

## నిర్మలమ్మ పద్దులో తెలుగు రాష్ట్రాలకు బూస్ట్!

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బడ్జెట్ లో కేంద్రం తెలుగు రాష్ట్రాలకు శుభవార్తలు చెప్పింది. హైదరాబాద్ మీదుగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లను ప్రకటించారు. అలాగే కొబ్బరి, కోకో, జీడి రైతులకు ప్రోత్సాహం ఇచ్చే ప్రకటన చేశారు. డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు ఇస్తున్నట్లు ప్రకటించారు. రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, టైర్-2, టైర్-3 నగరాలకు నిధులు, కొత్త జలమార్గాల అభివృద్ధి వంటి కీలక ప్రకటనలు చేశారు. కేంద్రం చేసిన ఈ ప్రకటనలు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడనున్నాయి.

**హైస్పీడ్ రైలు కారిడార్లు**

కేంద్ర బడ్జెట్ లో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ప్రతిపాదించారు. ఇందులో 3 కారిడార్లు హైదరాబాద్ మీదుగానే వెళ్తుండటం విశేషం. పుణే-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై కారిడార్లను నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందులో రెండు కారిడార్లు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లనున్నాయి.

**కొబ్బరి రైతులకు ఊరట**

కొబ్బరి రైతులకు ప్రయోజనం చేకూర్చడం కోసం కోకోనట్ ప్రమోషన్ స్కీమ్ ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఉత్పాదకత సరిగా లేని కొబ్బరి చెట్లను తొలగించి.. వాటి స్థానం మిగతా 02లో

- హైదరాబాద్ కేంద్రంగా హైస్పీడ్ రైళ్లు... రెండు రాష్ట్రాలకు కనెక్టివిటీ బలం
- కొబ్బరి రైతులకు ఊరట కోనసీమకు కొత్త ఆశలు
- కోకో సాగుకు జాతీయ మిషన్ ఏపీ రైతులకు గోల్డెన్ ఛాన్స్
- జీడిపప్పుపై దిగుమతి సుంకం పెంపు... ఉత్తరాంధ్రకు ధరల లాభం
- డేటా సెంటర్లకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే విశాఖ-హైదరాబాద్ హబ్‌లు
- రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్... ఏపీకి ఇండస్ట్రీ గేట్‌వే
- కొత్త జలమార్గాలు... రవాణా ఖర్చుల తగ్గింపు, ఉపాధి పెంపు
- ఆక్వా రంగానికి శుభవార్తలు.. రొయ్యల మేత, చేపల పెంపకానికి బడ్జెట్ బలం

## సౌమ్య కుటుంబానికి రూ.కోటి

**సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం**



- ఆమె తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకం
- సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి నివాళి
- తల్లిదండ్రులను ఓదార్చిన కృష్ణారావు

09

## ఫోన్ ట్యాపింగ్ జరిగింది నిజం

**రాష్ట్రాన్ని నడిపించింది కేసీఆర్ కాబట్టి ఆయనకి బాధ్యత ఉంటుంది**



- ఆయన ముఖ్యమంత్రిగా ఉండిన సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగింది
- కేంద్ర బడ్జెట్ చాలా బాగుంది
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

03

## ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

**పెండింగ్ బిల్లులు విడుదల**




- రూ.720 కోట్లు రిలీజ్ చేసిన ప్రభుత్వం
- 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మనేటి పెండింగ్ ఒకేసారి క్లియర్

09



## సీఎం రేవంత్ రెడ్డి ఘనత

- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వహిస్తున్న తొలి ఏఐ సదస్సుకు ముఖ్య అతిథిగా సీఎం
- దేశం మొత్తంలో ఒక్కరికే ఆహ్వానం విశేషంగా మారింది
- అమెరికా పర్యటనలో అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో విస్తృత భేటీలు
- స్వదేశానికి చేరుకోనున్న సీఎం.. మున్సిపల్ ఎన్నికలపై కీలక సమావేశాలు

03

## 'పాలమూరు - రంగారెడ్డి'.. ఎప్పుడు పూర్తయ్యేది?

**కెసిఆర్ హయాంలో నత్త నడకను తలపించిన పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులు**



- పదేళ్లలో పనుల సాగదీత.. ఎక్కడికక్కడే నిలిచిపోయిన పనులు
- తొమ్మిది పంపులకు గాను పదేళ్లల్లో ఒకే ఒక పంపు ప్రారంభం
- 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడి గా ఒక పంపు ప్రారంభించి చేతులు దులుపుకున్న కెసిఆర్
- మొదట జూరాల బ్యాక్ వాటర్ నుంచి నీరు తీసుకోవాలనేది ప్రాజెక్టు ఉదేశ్యం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి**

పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయితే పచ్చని మాగానుల్లో పసిడి సిరులు కురుస్తాయని ఆశపడిన రైతంగం ప్రతి ఏటా భంగపడుతూనే బతుకు వెళ్లడి స్తున్నాడు.2015 నుంచి ప్రాజెక్టు పనులు సా..గుతూనే ఉండడంతో ఇప్పటికే మిగతా 02లో

## సినీ నటుడు రఘునాథ రెడ్డి కన్నుమూత

**తెలుగు సినిమాకు లోటు**



- గుండెపోటుతో మృతి
- 350కి పైగా చిత్రాల్లో నటించిన నటుడు
- కాప్రాలోని నివాసంలో ఆరోగ్యం క్షీణించి కన్నుమూత
- నెల క్రితమే కుమారుడి మృతి.. ఆ విషాదాన్ని తట్టుకోలేకనే అనారోగ్యం
- 'కలిసుందాం రా', 'ఒసేయ్ రాములమ్మ', 'ఇంద్ర', 'తమ్ముడు' వంటి హిట్ చిత్రాల్లో గుర్తుండిపోయే పాత్రలు

10

## రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునే కుట్ర

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



- అందుకే బడ్జెట్ లో తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి
- నిధుల కోసం ఎన్నోసార్లు పీఎం, కేంద్రమంత్రులను కలిశాం
- ఒక్క విన్నపాన్నీ పరిగణలోకి తీసుకోలేదు
- కేంద్రం 2047 లక్ష్య సాధనలో భాగస్వాములం కాలేం

10

## పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం



ఐసీసీ అండర్-19 వన్డే వరల్డ్ కప్‌లో పాకిస్తాన్‌పై 58 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యంగ్ ఇండియా 252 రన్స్ చేయగా.. పాక్ 194 పరుగులకే ఆలౌటైంది. ఆయుశ్ మాత్రే, ఖిలాన్ చెరో 3 వికెట్లు, అంబరీశ్, హెనిల్, చౌహాన్, విహాన్ తలో వికెట్ చేశారు. ఈ గెలుపుతో ఆయుశ్ సేన జైత్ర యాత్రను కొనసాగిస్తూ సెమీ ఫైనల్‌లోకి అడుగు పెట్టింది. అఫ్ఘనిస్తాన్ తో సెమీస్ లో తలపడనుంది.

## మీరేనా.. ఆ పెద్దాయన?

**ఫోన్ ట్యాపింగ్‌లో మీ ప్రమేయం ఎంత**

- అలా చేయమని ఆదేశాలు మీరే ఇచ్చారా?
- ఆ పరికరాలు ఎక్కడి నుంచి తెప్పించారు?
- కేసీఆర్ సమాధానాల లీక్ ఇవ్వని సిట్?
- కేసీఆర్ పై సిట్ ప్రశ్నల వర్షం
- 4.50 గంటల పాటు వివిధ కోణాల్లో విచారణ
- ఏడుగురు పోలీస్ అధికారులిచ్చిన సమాచారమే
- త్వరలోనే హైకోర్టుకు సిట్ నివేదిక భావోద్వేగానికిలోనైన మాజీ సీఎం


10



**ముద్ర స్పెషల్**

వనదేవతల దర్శనం ముగించుకుని భక్తులు స్వగ్రామాలకు పయనం అమవడంతో శనివారం మేడారం ఖాళీ అవుతోంది... భక్తులు ఇళ్లకు తిరుగుముఖం పట్టడంతో విడిది కేంద్రాల వద్ద నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 02.02.2026
www.mudranews.in | @mudranews





రాఫ్లేసియా ఆర్నోల్డీ

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పువ్వు. దుర్వాసన కారణంగా "కార్ప్స్ ఫ్లవర్"గా ప్రసిద్ధి

# మౌలిక విప్లవం.. టెక్నాలజీకి పట్టాభిషేకం

(మొదటి పేజీ తరువాయి)

సాథ్ సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా ఈ బడ్జెట్ రూపొందించినట్లు ప్రకటించారు. కీలక రంగాలకు భారీ కేటాయింపులు, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు, ఫ్యూచర్స్ ట్రేడింగ్ పై పన్నుల పెంపు వంటి కీలక నిర్ణయాలు ఉన్నాయి. ఈ క్రమంలో నిర్మలమ్మ ప్రకటించిన 10 ముఖ్యమైన అంశాలు కీలకంగా మారాయి.

**క్యాపెక్స్ (పెట్టుబడులు) పెంపు**

ప్రభుత్వం మౌలిక సదుపాయాల మీద భారీ మొత్తంలో ఖర్చు చేసేందుకు సిద్ధమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో క్యాపెక్స్ రూ. 11.2 లక్షల కోట్లు ఉంటే 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ. 12.2 లక్షల కోట్లకు పెంచారు. అంటే దాదాపు 9 శాతం ఎక్కువ కేటాయింపులు చేశారు. ఇది ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని చెప్పవచ్చు.

**కొత్తగా 7 హై స్పీడ్ రైలు కారిడార్లు**

ముంబై-పూణె, పూణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగుడి మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించారు.

**బాండ్ మార్కెట్‌ను బలోపేతం**

కార్పొరేట్ బాండ్ మార్కెట్ ను మెరుగుపరచేందుకు మార్కెట్ మేకింగ్ ఫ్రేమ్ వర్క్, డెరివేటివ్స్ ప్రకటించారు. పెద్ద నగరాలు రూ.1,000 కోట్ల పైగా మున్సిపల్ బాండ్లు జారీ చేసినట్లయితే రూ. 100 కోట్ల ఇన్సెంటివ్ కల్పిస్తారు. చిన్న నగరాలకు అమృత్ స్కీమ్ కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**బ్యాంకింగ్ కమిటీ**



భారతదేశ తదుపరి దశ ఆర్థిక వృద్ధి కోసం బ్యాంకింగ్ సిస్టమ్ ను సిద్ధం చేసేందుకు హై లెవల్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఫైనాన్షియల్ స్టెబిలిటీ, ఇన్ క్లూజన్, కన్జూమర్ ప్రొటెక్షన్ పై దృష్టి పెట్టనున్నారు.

**ఎన్నారై ఇన్వెస్ట్ మెంట్ పరిమితి పెంపు**

ఎన్నారైలు ఒక కంపెనీలో ఇన్వెస్ట్ చేసే పరిమితిని 5 శాతం నుంచి 10 శాతానికి పెంచారు. మొత్తంగా ఉన్న పరిమితి 10 శాతం నుంచి 24 శాతానికి పెంచారు. దీంతో విదేశీ డబ్బు మరింత ఎక్కువగా దేశంలోకి రానుంది. మార్కెట్ లిక్విడిటీ మెరుగుపడనుంది

**ఫిస్కల్ కన్సాలిడేషన్ కొనసాగింపు**

వచ్చే ఆర్థిక సంవత్సరం FY27లో ఫిస్కల్ డెఫిసిట్ GDPలో 4.3 శాతానికి తగ్గుతుందని అంచనా వేశారు. FY26లో ఇది 4.4 శాతంగా ఉంది. నెట్ మార్కెట్ బారోయింగ్స్ రూ. 11.7 లక్షల కోట్లు, గ్రాస్ రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

**ఎస్ టీటీ పెంపు**

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ ను 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచారు. ఆప్షన్స్ ప్రీమియం, ఎక్సర్ సైజ్ ఆప్షన్స్ పై 0.1 శాతం, 0.125 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు.

**మెడికల్ టూరిజం**

భారతదేశాన్ని మెడికల్ టూరిజం (వైద్య పర్యాటకం) హబ్ గా మార్చేందుకు కొత్త స్కీం ప్రకటించారు. 5 ప్రాంతీయ మెడికల్ హబ్ లు ప్రైవేట్ సెక్టార్ తో కలిసి ఏర్పాటు చేయనున్నారు. ఈ హబ్ లలో హాస్పిటల్స్, విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రాలు, ఆయుష్ సెంటర్లు, డయాగ్నొస్టిక్స్, పోస్ట్ కేర్, రిహాబిలిటేషన్ వంటివి ఉంటాయి. మెడికల్ వాల్యూ టూరిజం సులభతరం చేసే కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తారు. డాక్టర్లు, ఇతర హెల్త్ ప్రొఫెషనల్స్ కు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

**రూ.1.4 లక్షల కోట్ల ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్**

16వ ఆర్థిక సంఘం సిఫార్సులను పూర్తిగా ఆమోదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్రాలకు విడుదల చేసే వాటా 41 శాతంగానే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్రాలకు మొత్తం రూ. 1.4 లక్షల కోట్లు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ గా ఇవ్వనున్నారు.

**క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు టాక్స్ హాలిడే**

డేటా సెంటర్లు, క్లౌడ్ సర్వీసెస్ లో పెట్టుబడులు పెరిగేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలో డేటా సెంటర్ సర్వీసెస్ ఉపయోగించి ప్రపంచ వ్యాప్తంగా క్లౌడ్ సర్వీసెస్ అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు టాక్స్ హాలిడే (టాక్స్ రాయితీ) ప్రకటించారు. అయితే దేశంలోని కస్టమర్లకు సర్వీసెస్ ఇవ్వాలంటే భారతీయ రీసెల్లర్ ఎంటిటీ ద్వారా మాత్రమే ఇవ్వాలి.

**బడ్జెట్ శర్మాలో.. ధరలు తగ్గేవి.. పెరిగేవి**

ప్రతిసారీ బడ్జెట్ అనగానే.. మధ్యతరగతి వర్గం, వేతన జీవులు ఇన్‌కంటాక్స్ గురించి దృష్టి సారించినట్లే వీరితో పాటు సామాన్యులు వేటి ధరలు తగ్గుతాయ్.. వేటి ధరలు పెరుగుతాయ్ అనే వాటిపై దృష్టి సారిస్తారని చెప్పొచ్చు. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్ లో కొన్ని కీలక ప్రకటనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదివారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈసారి ఇన్‌కంటాక్స్ గురించి పెద్దగా ఎలాంటి ప్రకటన లు లేవు. దీంతో మధ్య తరగతి వర్గం, టాక్స్ పేయర్లు, వేతన జీవులు ఒక రకంగా నిరాశ చెందారని చెప్పొచ్చు. టాక్స్ రేట్లు ఇంకా తగ్గుతాయని చూస్తే నిరాశే ఎదురైంది. అయితే ఇదే సమయంలో సామాన్యులు, మధ్య తరగతి వర్గం.. మరో అంశంపై దృష్టి సారిస్తుంటుంది. ప్రభుత్వం వేటిపై దిగుమతి సుంకాల్ని తగ్గిస్తుందని చూస్తుంటారు. అంటే దిగుమతి సుంకాల్ని తగ్గిస్తే వాటి ధరలు దిగొస్తాయని చెప్పొచ్చు. గతంలో 2024 బడ్జెట్‌లో బంగారం, వెండి పై కస్టమ్స్ డ్యూటీ తగ్గించగా.. వెంటనే బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. ఇప్పుడు కూడా దిగుమతి సుంకాలకు సంబంధించి కొన్ని ప్రకటనలు చేశారు.

ఈసారి క్యాన్సర్ రోగులు ఉపయోగించే .. 17 రకాల ఔషధాలపై దిగుమతి సుంకం తగ్గించగా.. వీటి ధరలు తగ్గనున్నాయి. పౌర విమానాల విడిభాగాలపైనా పన్ను తగ్గించగా.. వీటి ధరలు దిగిరానున్నాయి. ఈవీ బ్యాటరీలు సహా స్మార్ట్ ఫోన్ దిగుమతులపైనా సుంకం తగ్గించగా.. వీటి రేట్లు దిగిరానున్నాయి. సోలార్ గ్లాస్ తయారీ వస్తువులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు కల్పించింది. షూ అప్పర్ ఎగుమతుల కోసం.. దీనికి అవసరమైన మెటీరియల్ దిగుమతులపై డ్యూటీ ఫ్రీ చేశారు. క్యాపిటల్ గూడ్స్, క్రిటికల్ మినరల్స్ పైనా బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తొలగించారు. వీటికి అదనంగా.. విదేశీ చదువులు, వైద్యంపై టీడీఎస్ 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ టూర్ ప్యాకేజీలపైనా మూలం వద్ద పన్ను వసూలు- TCS టాక్స్ తగ్గించగా.. ఇది కూడా చవకగా మారనుంది. ఇదే సమయంలో పొగాకు సహా విదేశీ మద్యం వంటి వాటి ధరలు పెరగనున్నాయి.

స్టాక్ ఆప్షన్స్, ఫ్యూచర్స్ ఆప్షన్ ట్రేడింగ్‌కు సంబంధించి.. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెరిగింది. ఇన్‌కం టాక్స్ వివరాల్ని తప్పుగా వెల్లడిస్తే.. చెల్లించాల్సిన పన్నుపై 100 శాతం జరిమానా పడుతుంది.

బ్రూవింగ్, వెండింగ్ మెషీన్లు, కాఫీ రోస్టింగ్ వంటివి ఖరీదైనవిగా మారతాయి. కొన్ని రకాల ఎరువులపై దిగుమతి సుంకాలు తొలగించగా.. వీటి ధరలు పెరగొచ్చు.

# 'పాలమూరు - రంగారెడ్డి'.. ఎప్పుడు పూర్తయ్యేది?

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి కావలసిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారింది. పదేళ్లుగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా కొనసాగినా ఈ ప్రజలు ప్రాజెక్టు పనుల పై పెద్దగా శ్రద్ధ చూపలేదనే విమర్శలు మూటగట్టుకున్నాడు. ఆయన హయాంలో ఈ ప్రాజెక్టుకు పునాది పడినా సకాలంలో పను లు చేయించడంలో పూర్తిగా విఫలం చెందారు. ఈ ప్రాజెక్టు మొదటగా జూరాల నుంచి వరద జలాలను తీసుకోవాలనేది ముఖ్య ఉదేశ్యం. ఖర్చు కూడా చాలా తక్కువగా అయ్యేదాన్ని నీటిపారుదల అధికారుల అంచనా వేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదే విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారు. జూ రాల నుంచి ప్రాజెక్టు పనులు చేపట్టితే ఖర్చు తక్కువ అవుతుందని.. కమీషన్లు తక్కువగా వస్తాయని అనుకున్న కెసిఆర్ ఈ డిజైన్ మార్పు చేయించి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునే విధంగా ప్రణాళిక తయారు చేయించారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. 2023 లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టుకు కెసిఆర్ గ్రహణం పట్టి నేటికీ పనులు ముందుకు సాగడం లేదు.

**ప్రాజెక్టు ముఖ్య ఉదేశ్యం**


మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు తాగు, సాగునీరు, హైదరాబాద్ నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీటి సరఫరా అందించే ఉద్దేశ్యంతో పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు వద్ద శ్రీశైలం జలాశయం నుంచి నీటిని పంపింగ్ చేసి రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం లక్ష్మీదేవిపల్లి జలాశయం వరకు నీటిని పంపిచేందుకు డిజైన్ రూపొందించారు. కేవలం వర్షాకాలంలో 60 రోజుల పాటు వరద జలాలు రోజుకు 1.5 టి.ఎమ్.సి చొప్పున మొత్తం 90 టిఎమ్‌సి ల నీటిని ఎత్తిపోయాలనేది ప్రాజెక్టు లక్ష్యం. శ్రీశైలం జలాశయం నుండి ఐదు అంచెల్లో ఎత్తిపోసి 670 మీ. ఎత్తున ఉన్న లక్ష్మీదేవిపల్లి జలాశయానికి నీటిని ముందుగా చేరుస్తారు. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 5 లిఫ్టులు, 6 జలాశయాలూ నిర్మించాలి. రూ. 35,200 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టుకు 2015 లో తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రాజెక్టును 2 దశల్లో నిర్మిచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మొదటి దశలో మొత్తం నీటిని తరలించడానికి పంపుహౌసులు, జలాశయాలు, పైపులైన్లు, కాలువలు, సొరంగాలు నిర్మించి, తాగునీటి , పారిశ్రామిక అవసరాలూ తీర్చేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తారు. రెండవదశలో సాగునీటిని అందించేందుకు అవసరమైన కాలువలు, సొరంగాలు నిర్మిస్తారు. ఇదీ ప్రాజెక్టు విశ్వరూపం. అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు 2015, జూన్ 11న ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శంకుస్థాపన చేశారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్లన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో భాగంగా నీటిని తరలించేందుకు నార్లపూర్ వద్ద తొమ్మిది మోటార్లు బిగించి వాటి ద్వారా పలు జలాశయాలకు నీటిని పంపింగ్ చేస్తారు. ఇందులో భాగంగా నార్లాపూర్ వద్ద 8.51 టీఎంసీల నీటిని నిలువ చేసేందుకు జలశయాన్ని నిర్మించారు. ఇక్కడి నుంచి ఎదుల వద్ద నిర్మించిన జలాశయానికి నీటిని కాలువల ద్వారా పంపిస్తారు.

ఈ జలాశయం లో 6.55 టీఎంసీ ల నీటిని నిలువ ఉంచేందుకు నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఇక్కడి నుంచి వట్టెం వద్ద నిర్మించిన జలాశయం లోకి నీటిని పంపిస్తారు. ఇక్కడ 16.74 టీఎంసీ నీరు నిలువ ఉండే జలాశయంను నిర్మించారు. ఇక్కడి నుంచి కరివెన గ్రామం వద్ద నిర్మించిన జలాశయంకు నీటిని పంపిస్తారు. ఇందులో 17.34 టీఎంసీ ల నీటి నిలువ సామర్థ్యం ఉంది. చివర ఉద్దాండాపూర్ గ్రామం వద్ద నిర్మించిన జలాశయంలోకి నీటిని పంపిస్తారు. ఇందులో 16.03 టీఎంసీ నీరు నిలువ ఉంటుంది. ఈ జలశయాల పనులు పూర్తయినా నీటిని తరలించడం లో కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందింది. నార్లాపూర్ వద్ద తొమ్మిది మోటార్లకు గాను 2023, సెప్టెంబర్ 16న నార్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం వద్ద సీఎం కెసిఆర్ ఒక్క మోటార్ ను ఆన్ చేసి నీటిని వదిలి చేతులు దులుపుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో ముందు జాగ్రత్తగా కెసిఆర్.. ప్రజాభిమానం పొందేందుకు పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ పూర్తి అయిందని ఎన్నికల స్టంట్ చేశారు. కానీ ఒక్క మోటార్ ఆన్ చేసిన గంట లోపే ఆఫ్ చేశారు. తొమ్మిది మోటార్లకు ఒక్క మోటార్ ఆన్ చేసి ప్రాజెక్టు వైపు మళ్ళీ కన్నెత్తి చూడలేదు.2023 లో వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాల్లో రెండింటిలో మాత్రమే కెసిఆర్ పార్టీ గెలిచింది. పాలమూరు కెసిఆర్ చేసిన అన్యాయానికి ఇక్కడి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు. 12.30 లక్షల ఎకరాలకు నీరందిస్తానని అధికారం లో ఉన్న కెసిఆర్ పదేళ్లుగా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు.



**మా హయాంలో పూర్తి చేస్తాం గత అసెంబ్లీ లో సీఎం**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వచ్చే మూడేళ్లలో పూర్తి చేస్తామని గత అసెంబ్లీ లో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. గత సీఎం కెసిఆర్ మాదిరిగా కమీషన్ల కోసం ఆరాటపడడం లేదని, ఆయన కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టు ను వాడుకున్నారని అసెంబ్లీ సాక్షిగా కెసిఆర్ తీరును రేవంత్ రెడ్డి ఎండగట్టారు. ఈ ఒక్క ప్రాజెక్టు కాకుండా నారాయణ పేట, కొడంగల్ లిఫ్ట్ పనులు కూడా కెసిఆర్ తొక్కి పెట్టారని, ఈ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు భూ సేకరణ పనులు చేపడుతున్నామని ప్రకటించారు.ఈ రెండు ప్రాజెక్టులు పూర్తవుతే ఉమ్మడి పాలమూరు జిల్లా పచ్చని పైరుల తో కళకళలాడుతుంది. కరువు జిల్లాగా పేరు పొందిన పాలమూరు జిల్లా సిరులు కురిపించే జిల్లాగా పేరు పొందుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సీఎం రేవంత్ ఈ వైపుగా అడుగులు వేస్తే రైతుల గుండెల్లో నిలిచిపోతారు.



# నిర్మలమ్మ పద్దులో తెలుగు రాష్ట్రాలకు బూస్ట్!

(మొదటి పేజీ తరువాయి)

లో కొత్త మొక్కలు నాటేందుకు ఈ పథకం తోడ్పాటును అందించనుంది. కోనసీమతో పాటు ఇతర ప్రాంతాల్లో కొబ్బరిపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, కూలీలకు ఇది ఉపయోగపడనుంది.

**కోకో, జీడి పప్పు రైతుల కోసం**

బడ్జెట్ 2026-27లో కోకో, జీడి పప్పు సాగు చేసే రైతుల కోసం కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. ఏపీలోని కోస్తా, ఏజెన్సీ ప్రాంతాల్లో కోకో, జీడి పప్పును ఎక్కువగా సాగు చేస్తారనే సంగతి తెలిసిందే. కోకో ఎగుమతుల్లో ఏపీదే అగ్రస్థానం. జాతీయ కోకో మిషన్ ద్వారా కోకో సాగు విస్తీర్ణం పెంచనున్నారు.

పాత తోటలను పునరుద్ధరించడానికి, కొత్త మొక్కల పంపిణీ కోసం 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. విదేశాల నుంచి కోకో దిగుమతి చేసుకునే బదులు స్థానికంగా పండించిన కోకో వాడకాన్ని పెంచే చాక్లెట్ కంపెనీలకు పన్ను రాయితీలు ఇచ్చారు. దీని వల్ల ఏపీ రైతులు సాగు చేసే కోకో పంటకు డిమాండ్ పెరిగి మంచి ధర లభిస్తుంది.

ఇక జీడిపప్పు విషయానికి వస్తే.. విదేశాల నుంచి వచ్చే ప్రాసెస్డ్ జీడిపప్పుపై దిగుమతి సుంకాన్ని పెంచారు. దీని వల్ల స్థానిక రైతులు సాగు చేసే జీడిపప్పుకు మంచి ధర లభిస్తుంది. ఉత్తరాంధ్రలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లను ఆధునికీకరించడం కోసం ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద నిధులు కేటాయించారు.

**డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే**

భారత్‌లో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు కేంద్రం గుడ్ న్యూస్ ప్రకటించింది. 2047 వరకు ట్యాక్సులు కట్టాల్సిన అవసరం లేకుండా బడ్జెట్లో కీలక ప్రకటన చేశా రు. విశాఖపట్నంలో గూగుల్ మెగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లోనూ చాలా డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. కేంద్రం చేసిన ట్యాక్స్ హాలిడే ప్రకటనతో తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని డేటా సెంటర్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సౌలభ్యాన్ని పొందడానికి కంపెనీలు స్థానిక రీసెల్లర్స్ ద్వారా భారత కస్టమర్లకు సేవలు అందించాలనే షరతు విధించింది. 20 ఏళ్లపాటు ట్యాక్స్ హాలీడే ప్రకటించడం ద్వారా.. విశాఖ నగరం మరింతగా డేటా సెంటర్ల కోసం పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంది. సముద్ర గర్భంలో కేబుల్స్ కనెక్టివిటీ ఉండటంతో విశాఖ నగరం ఇంటర్నేషనల్ డేటా కారిడార్‌గా మారనుంది. సెమీకండక్టర్ల తయారీకి ప్రోత్సాహం అందించనుండటం కూడా తెలుగు రాష్ట్రాలకు కలిసొచ్చే అంశం.

**రేర్ ఎర్త్ మినరల్స్**

ప్రపంచం మొత్తం ఇప్పుడు రేర్ ఎర్త్ మినరల్స్ వైపు చూస్తోంది. దీంతో భారత్ కూడా రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణపై ఫోకస్ పెట్టింది. కేంద్ర బడ్జెట్లో ఏపీ, ఒడిశా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల ఏపీలో పరిశ్రమలు డెవలప్ అయ్యే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ వాహనాల్లో వాడే పర్మ నెంట్ మ్యాగ్నెట్లు ఏపీలోనే తయారైతే.. మన రాష్ట్రం ఈవీ తయారీ హబ్‌గా మారనుంది.

**టైర్-2, టైర్-3 నగరాలకు నిధులు..**

చిన్న పట్టణాలను డెవలప్ చేయడంపై కేంద్రం స్పెషల్ ఫోకస్ పెట్టింది. 5 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాలు, నగరాల అభివృద్ధికి కేంద్రం నిధులు అందించనుంది. దీని వల్ల తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, వరంగల్, కరీంనగర్ తదితర నగరాలకు ప్రత్యేక గ్రాంట్లు అందనున్నాయి. టెంపుల్ సిటీలను కూడా అంతర్జాతీయ పర్యాట క కేంద్రాలుగా మార్చాలని కేంద్రం భావిస్తోంది. ప్రధాన ఆలయాలు ఉన్న పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కోసం కేంద్రం నిధులు మంజూరు చేయనుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు టెంపుల్ టౌన్లకు గ్రాంట్లు లభించనున్నాయి.

**కొత్త జలమార్గాలు**


వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 20 కొత్త జలమార్గాలను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ప్రకటించిన 111 జలమార్గాల జాబితా నుంచి ఈ 20 జ లమార్గాలను ఎంపిక చేశారు. ఇందులో తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. కాకినాడ-పుదుచ్చేరి కెనాల్, విజయవాడ-ముక్త్యాల, భద్రాచలం-రాజమండ్రి మార్గాలు ఉండనున్నాయి. వీటివల్ల రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

**రొయ్యల మేతపై సుంకాల తగ్గింపు**

రొయ్యల సాగులో ఎక్కువ ఖర్చు వాటి మేత కోసం చేయాల్సి ఉంటుంది. కేంద్ర బడ్జెట్లో రొయ్యల మేత తయారీకి అవసరమయ్యే ముడి పదార్థాలపై దిగుమతి సుంకాన్ని తగ్గిం చారు. దీని వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. అంతే కాకుండా ఏపీ తీర ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను ఏర్పాటు చేయనున్నారు. రొయ్యలకు సోకే వ్యాధులను గుర్తించేందుకు కేంద్రం నిధులతో ఏపీలో మరిన్ని ల్యాబ్‌లు నెలకొల్పుతారు.

**ప్రధాన రిజర్వాయర్లలో చేపల పెంపకం**

దేశవ్యాప్తంగా 500 ప్రధాన రిజర్వాయర్లు, అమృత సరోవర్లలో చేపల పెంపకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. కేజ్ కల్చర్, సీడ్ స్టాకింగ్ బ్రూడ్ బ్యాంకులను ఏర్పాటు చేస్తారు. దీని వల్ల ఏపీ, తెలంగాణల్లోని జలాశయాల్లో చేపల పెంపకానికి మరింత ప్రోత్సాహం లభించనుంది.





## పన్ను స్లాబ్‌లలో మార్పుల్లేవు

**ముద్ర, ఢిల్లీ:**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్‌లో పాత, కొత్త ఆదాయపు పన్ను విధానాల కింద స్లాబ్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో వేతన జీవులు ఆశించిన నేరుగా పన్ను తగ్గింపు ఊరట దక్కలేదు. అయితే పన్ను విధానంలో స్థిర త్వాన్ని కొనసాగిస్తూ, కాంప్లైన్స్ సులభతరం చేసే పలు చర్యలను ప్రభుత్వం ప్రకటించింది. ఐటీఆర్ దాఖలు గడువుల పొడిగింపు, తక్కువ టీసీఎస్ రేట్లు, మోటార్ ప్రమాద పరిహార వడ్డీపై టీడీఎస్ మినహాయింపు, విదేశీ ఆస్తుల వెల్లడి కోసం ప్రత్యేక విండో వంటి చర్యలు చిన్న పన్ను చెల్లింపుదారులకు ఉపశమనంగా నిలవనున్నాయి. అలాగే బైబ్యాక్ ఆదాయాలను మూలధన లాభాల పరిధిలోకి తీసుకురావడం పెట్టుబడిదారులకు స్పష్టతనిస్తుంది.

మరోవైపు ఆర్థిక క్రమశిక్షణపై దృష్టి సారించిన ప్రభుత్వం లోటు తగ్గింపు, రుణ మార్గసూచితో స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తంగా చూస్తే—స్లాబ్ మార్పులు లేకపోయినా, బడ్జెట్ 2026 పన్ను వ్యవస్థలో స్పష్టత, కంప్లైన్స్ సౌలభ్యం వైపు అడుగు వేసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు
వెల్విట్షియా మిరాబిలిస్ : నమీబియా ఎడారిలో మాత్రమే కనిపిస్తుంది. వెయ్యేళ్లకు పైగా జీవించే సామర్థ్యం ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ రుజువైంది..

- కేసీఆర్ బాధ్యత వహించాలి
- ప్రజా ఆమోద యోగ్యంగా కేంద్ర బడ్జెట్
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

**ముద్ర, ఢిల్లీ:**

ఫోన్ ట్యాపింగ్ చేశారనేది రుజువైందని, దీనికి నాటి ముఖ్యమంత్రి కేసీఆరే బాధ్యత వహించాలని ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణపై స్పందించారు. ఢిల్లీ వేదికగా ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఇప్పటికే రుజువైందని తెలిపారు. సిట్‌కి లోబడి విచారణ ఉంటుందని ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. దేశాభివృద్ధిలో రాజీ పడకుండా ఉందని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. రూ.53 లక్షల కోట్లకు పైగా అంచనాలతో బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. దేశ ప్రజల హితమే ధ్యేయంగా బడ్జెట్ ఉందని చెప్పుకొచ్చారు. గత బడ్జెట్ కంటే ఎక్కువగా రూ.1.50 లక్షల కోట్ల నిధులను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేటయించారని వెల్లడించారు. దేశంలో 7 శాతం జీడీపీ పెరగడానికి యువత, విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌కి పెద్ద పీట వేశారని తెలిపారు. యువతను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌కి కేంద్రం రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వివరించారు. ప్రతి జిల్లాకు ట్రామా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. కేన్సర్‌తో సహా 17 రకాల మందుల ధరలు తగ్గనున్నాయని తెలిపారు.



## అరాచక పాలనపై విచారణ

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అరాచకంపై విచారణలు జరుగుతున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఘోరమైన నేరమన్న ఆయన అందులో ప్రమేయం ఉన్న నేతలే విచారణకు హాజరు అవుతున్నారని చెప్పారు. కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు మాదిరి కేసీఆర్ కూడా సిట్ ఎదుట హాజరు అవుతున్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు ఎందుకు హడావిడి చేస్తున్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఆదివారం ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో సిట్ విచారణకు కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నిరసనలపై ఆయన స్పందించారు. ఈ మేరకు హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లో సిట్ విచారణకు కేసీఆర్ హాజరవుతున్న వేళ బీఆర్ఎస్ నేతలు అతిఉత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ విచారణను భూతద్దంలో చూడటం హాస్యాస్పదమన్నారు. గతంలో శిబూ సోరెన్, మాయావతి, జయలలిత, లాలు ప్రసాద్ యాదవ్, యడ్యూరప్ప లాంటి సీఎంలు కూడా విచారణలు ఎదుర్కొన్నారని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. టెలిగ్రాఫ్ యాక్ట్ ప్రకారం విపత్కర పరిస్థితుల్లో మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయాలని చెప్పారు. కానీ బీఆర్ఎస్ పాలనలో ఇందుకు భిన్నంగా జరిగిందన్నారు.





## సీఎం రేవంత్ కు అరుదైన గౌరవం

- ఏఐ సదస్సుకు రండి..
- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలి ఏఐ సదస్సుకు రేవంత్ రెడ్డికి ఏకైక ఆహ్వానం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సీఎం రేవంత్ రెడ్డి కి అరుదైన గౌరవం లభించింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వహించే తొలి ఏఐ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించాలని ఆయనకు ఆహ్వానం అందింది. ఈ సదస్సుకు భారత్ నుంచి సీఎం ఒక్కరికే ఆహ్వానం అందడం విశేషం. మరోవైపు అమెరికా పర్యటనలో భాగంగా హార్వర్డ్ యూనివర్సిటీలో తన చివరి రోజున సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో పాటు యూనివర్సిటీలోని పలు పాఠశాలల విద్యార్థులు, ఎంఐటీ, కొలంబియా వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు, పూర్వవిద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నాయకత్వం, విజయాల సాధన, ఆర్థికాభివృద్ధి, అభివృద్ధి నమూనాలు, స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ, రైతు సంక్షేమం, మహిళలుయువత సాధికారత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కాగా నేడు తెల్లవారుజామున సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరుకానున్న ఆయన.. మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. ఇందులో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలాబలాలపై చర్చించనున్నట్లు సమాచారం.



## వాస్తవాలకు దూరంగా 'బడ్జెట్'

- రాహుల్ గాంధీ

**ముద్ర, ఢిల్లీ:**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది దేశంలోని వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్ అని ఎక్స్ వేదికగా విమర్శలు ఎక్కుపెట్టారు. 'యువతకు ఉద్యోగాలు లేవు, కుంగుతున్న తయారీ రంగం, పెట్టుబడులను వెనక్కు తీసుకుంటున్న ఇన్వెస్టర్లు, సంక్షోభంలో రైతాంగం, అంతర్జాతీయ సంక్షోభాలతో ఎదురవుతున్న ముప్పు.. వీటన్నిటినీ బడ్జెట్‌లో పట్టించుకోలేదు. ఇది తప్పులు సరిదిద్దుకోలేని బడ్జెట్ దేశంలోని వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్' అని ఎక్స్ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ మాత్రం బడ్జెట్‌పై విమర్శలు ఎక్కుపెట్టింది. బడ్జెట్ నిస్సారంగా ఉందని కామెంట్ చేసింది. 'బడ్జెట్ మొత్తాన్ని ఇంకా చదవాల్సి ఉన్నప్పటికీ 90 నిమిషాల బడ్జెట్ ప్రసంగాన్ని గమనిస్తే ఇది అంచనాలను అసలేమాత్రం అందుకోలేదనే చెప్పాలి. పూర్తి నిస్సారంగా ఉంది. బడ్జెట్‌లో పారదర్శకత లోపించింది. ముఖ్య పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు' అని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ విమర్శించారు. అంతకుముందు, మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రసంగిస్తూ బడ్జెట్‌ను సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దూసుకుపోతోందని అన్నారు. ప్రభుత్వం తన బాధ్యతలన్నిటినీ నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ దేశం ఆర్థిక క్రమశిక్షణతో సుస్థిరాభివృద్ధి బాటలో సాగుతోందని అన్నారు. దీనిపై కాంగ్రెస్ విమర్శలు చేసింది.

## జాప్యాన్ని ఉపేక్షించం

- ఎస్ఎల్ బీసీ పనుల సమీక్ష పై రూట్ మ్యాప్
- భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వం చేతికి హెలి-బోర్న్ సర్వే నివేదిక
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఎల్.బి.సి నిర్మాణం పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగం మార్గం పనులను నిరంతరం కొనసాగించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. సొరంగ నిర్మాణ పనులలో ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. అర్ధాంతరంగా నిలిచి పోయిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ కోసం చేపట్టిన హెలిబోర్న్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని తెలిపారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారేజ్ ల పునరుద్ధరణ పనులపై ఆయన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో నీటిపారుదల శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం మిగిలిన భాగం పూర్తి చేయడానికి అవసరమైన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఏరియల్ ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన తెలిపారు. సొరంగమార్గం పూర్తికి సర్వే ఆధారంగా రూపొందించిన నివేదిక దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భౌగోళికంగా ప్రతికూల పరిస్థితిలు ఏర్పడితే ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టదానికి ఈ సర్వే ఉపకరిస్తుందని పేర్కొన్నారు. సొరంగమార్గం పూర్తి చేసేందుకు ఆధునిక పరిజ్ఞానం వినియోగించడంతో పాటు శాస్త్రీయ పద్ధతిలో నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేక చీఫ్ ఇంజనీర్‌ను నియమించాలని ఆదేశించారు. నిరంతరం పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యులు అవుతారని ఆయన చెప్పారు. కాళేశ్వరం బ్యారేజ్ ల పనుల పునరుద్ధరణ పనులు వేగవంతం కోసం అవసరమైన సాంకేతిక సంస్థలను,డిజైన్ కన్సల్టెంట్స్ సమన్వయం ఆవశ్యకత గురుంచి మంత్రి వివరించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించే పరీక్షల షెడ్యూల్,ప్రాజెక్ట డిజైనర్ల పనితో సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరస్పరం సమన్వయం చేసుకుంటూ పోతే కేంద్ర జల వనరుల సంఘం పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుండి డిజైన్ లకు దశలవారిగా అనుమతులు పొందడం సులభతరమౌతుందని ఆయన చెప్పారు. ఈ మేరకు ఫిబ్రవరి 16 తరువాత ఎన్.డి.ఎస్.ఏ నిపుణుల కమిటీ తో సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.



## ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయలేదు

- ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష తప్పదు
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర, మహబూబాబాద్ :**

తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాల్సిన గత ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించిందని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యవాదులు, ప్రతిపక్ష పార్టీల నేతలు సొంత కుటుంబాల్లో అల్లుడు ఏం మాట్లాడుతున్నారో వినడానికి ఫోన్ ట్యాపింగ్ చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో మేధావులు , విద్యావంతులు ,రాజకీయ నాయకులతో పాటు సొంత అల్లుడు ఫోన్‌లు ట్యాపింగ్ చేసి విన్న గత పాలకులు ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఫోన్ ట్యాపింగ్‌ను తన ఆయుధంగా మలుచుకుందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, జర్నలిస్టు లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై నిరంతర నిఘా పెట్టిందని చెప్పారు. తమ అధికారానికి అక్రమాలకు అడ్డగా మార్చుకొని హైకోర్టు జడ్జిలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. సీఎం అనుమతి లేకుండా ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చి ఇంత పెద్ద ఎత్తున ఫోన్ ట్యాపింగ్ చేయడం సాధ్యం అవుతుందా...? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఓడిపోవడంతోనే ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ధ్వంసం చేశారన్నారు. ఇన్ని తప్పులు పెట్టుకుని ఈ వ్యవహారంలో సిట్ చర్యలను కక్ష సాధింపులని ఆరోపించడం తగదన్నారు. తప్పు జరిగినప్పుడు ఏ స్థాయి వ్యక్తులనైనా పోలీసులు విచారణ చేస్తారనీ అది నిరూపణ అయితే శిక్షలు తప్పవన్నారు. కేసీఆర్‌ను విచారణకి పిలిస్తే ధర్నాలు చేస్తాం, బంద్‌లు చేస్తామని పిలుపునిచ్చి పాల్గొంటున్న అనేక మంది నేతల ఫోన్‌లు ట్యాపింగ్ చేసి ఉంటారన్నారు.

## దీదీతో మహిళలకు ధీమా..

- రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు
- లక్‌పతీ దీదీ పథకం పొడిగింపు

**ముద్ర, ఢిల్లీ:**

దేశంలోని మహిళలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త అందించారు. పార్లమెంటులో బడ్జెట్ 202627 ప్రవేశపెట్టిన క్రమంలో సొంతంగా వ్యాపారం చేయాలనుకునే మహిళలకు ఆర్థిక సాయం అందించే లక్‌పతీ దీదీ యోజనను పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. 2024లో తీసుకొచ్చిన ఈ స్కీమ్ విజయవంతమైన క్రమంలో మరికొంత కాలం పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలను ఎంటర్‌ప్రైజ్ ఓనర్లుగా మార్చడమే ఈ పథకం లక్ష్యమని తెలిపారు. క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లలో కమ్యూనిటీ ఆధారిత రిటైల్ ఔట్లెట్లుగా సెల్ఫ్ హెల్ప్ ఎంటర్‌ప్రూనర్ మార్ట్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

**లక్‌పతీ దీదీ స్కీమ్ గురించిన వివరాలు:**

202425 బడ్జెట్‌లోనే ఈ లక్‌పతీ దీదీ యోజనను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ స్కీమ్ ద్వారా 2 కోట్ల మంది మహిళలకు ఆర్థిక సాయం అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్రం తెలిపింది. ఆ తర్వాత ఈ టార్గెట్‌ను 3 కోట్లకు పెంచారు. ఇప్పుడు మరోసారి ఈ స్కీమ్ పొడిగించడం గమనార్హం. ఈ లక్‌పతీ దీదీ స్కీమ్ ద్వారా సొంతంగా వ్యాపారం చేయాలనుకునే మహిళలకు ఏకంగా రూ.5 లక్షల వరకు ఎలాంటి వడ్డీ లేకుండా లోన్ ఇస్తారు. లక్‌పతీ దీదీ స్కీమ్ ద్వారా మహిళలకు వడ్డీ లేను








రుణాలు రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పొందేందుకు అవకాశం ఉంటుంది. మహిళలకు ఆర్థిక స్వాతంత్రం కల్పిండమే ఈ స్కీమ్ ఉద్దేశంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. స్వయం సహాయక బృందాల్లో ఉన్న మహిళలకు మాత్రమే ఈ రుణాలు అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు చిన్న చిన్న గ్రూపులుగా ఏర్పడి నెలకు కొంత పొదుపు చేస్తూ ఒక స్వయం సహాయక బృందంతో లోన్స్ పొందుతారు. లక్‌పతీ దీదీ స్కీమ్‌ను ప్రభుత్వ గ్రామీణ మంత్రిత్వ శాఖ అమలు చేస్తుంది. మహిళలకు వారు ఎంచుకున్న వ్యాపారంలో శిక్షణ ఇవ్వడం, వస్తువుల్ని మార్కెట్లకు తరలించడం, విక్రయాలకు సంబంధించిన శిక్షణ కల్పిస్తారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 02.02.2026
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

ఆధ్యాత్మికం

# ఏకాంతం.. ఆత్మబలానికి నిశిత సాధనం



మానవ చరిత్రలో కోవిడ్ మహమ్మారి ఒక చీకటి అధ్యాయాన్ని మిగిల్చింది. ఆ సమయంలో క్వారంటైన్ గదుల్లో బంధీలై, కేవలం ఒంటరితనం భారంతోనే ఎందరో ప్రాణాలు విడిచిన ఉదంతాలు మనం చూశాం. కానీ, అదే కాలం మనకు ఒక గొప్ప పాఠాన్ని కూడా నేర్పింది: "నువ్వు నీతో ఎంతవరకు ప్రయాణించగలవు?" అనేది ఆ పాఠం సారాంశం. నేడు సమాజంలో పెరిగిపోతున్న పెట్స్ సంస్కృతి గానీ, సామాజిక కలయికలు గానీ ఆ ఒంటరితనం తాలూకు భయం నుంచే పుట్టుకొచ్చాయి. అయితే నిజానికి ఒంటరితనం వేరు, ఏకాంతం వేరు.

## బంధాల భ్రమ - సత్యం

మనుషుల రాకపోకలు ప్రకృతి సహజం. జననం ఒక కలయిక అయితే, మరణం ఒక వీడ్కోలు. బంధాలు ఇచ్చే క్షణికానందం వెనుక శాశ్వతమైన కన్నీటి ఛాయలు దాగి ఉంటాయి. "అన్నీ నావే" అనుకునే భ్రమ నుంచి బయటపడి, బంధాల పరిమితులను గుర్తించిన రోజే మనిషి 'స్థితప్రజ్ఞుడు' అవుతాడు. సామాన్యులు సైతం నిరంతర సాధన ద్వారా ఈ అనుబంధాల సంకెళ్ళను తెంచుకుని, స్వీయ విముక్తిని పొందవచ్చు.

## ఏకాంతంలోనే ఆత్మ సందర్శనం

మనం ఇతరులపై ఎంతగా ఆధారపడతామో, అంతగా మనల్ని మనం కోల్పోతాము. ఏకాంతం అనేది మనల్ని మనం ఆవిష్కరించుకునే ఒక ప్రయోగశాల. చుట్టూ ఉన్న లోకం నిశ్శబ్దమైనప్పుడే, మన లోపలి అంతరాత్మ స్వరం స్పష్టంగా వినిపిస్తుంది.

బలహీనులు తోడు కోసం ఆరాటపడుతూ ఇతరుల నీడలో సేదతీరాలని చూస్తారు. బలవంతులు ఏకాంతాన్ని ఆయుధంగా మలుచుకుని, ఒంటరిగానే శిఖరాలను అధిరోహిస్తారు.

ఎవరెస్ట్ వంటి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రయాణం ఒంటరిగానే సాగాలి. ఆ ప్రయాణం కష్టతరంగా అనిపించినా, అగ్రస్థానానికి చేరుకున్నాక లభించే అనుభూతి సాటిలేనిది.

## అంతర్గత కాంతే అసలైన మార్గదర్శి

బయటి ప్రపంచంలో మెరిసే ఆకర్షణలు మినుగురు పురుగుల వంటివి. అవి దారిని చూపవు సరే కదా, మనల్ని తప్పుదారి పట్టిస్తాయి. మన లోపల కోటి సూర్యుల ప్రభ కలిగిన మేధస్సు, శక్తి దాగి ఉన్నాయి. ఆ అంతర్గత శక్తిని, ఆ 'ఏకత్వాన్ని' రథసారథిగా మార్చుకున్నప్పుడు జీవితం ఒక యుద్ధంలా కాకుండా, ఒక అద్భుతమైన యానంగా మారుతుంది.

ఒంటరితనాన్ని చూసి భయపడటం ఆపేసి, ఏకాంతాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. తనను తాను మలుచుకునే శిల్పికి ఏకాంతమే ఉలి. తనను తాను గెలిచే యోధుడికి ఏకాంతమే యుద్ధభూమి. ఈ సత్యాన్ని గ్రహించిన రోజే మనిషి నిజమైన ఆనందాన్ని, అపారమైన శక్తిని పొందుతాడు.

# పుస్తకం - అక్షరామృత కలశం

**పుస్తకం —**
కళ్లకు అందాలు చూపి,
అక్షరాల అద్దంలో ప్రకృతిని
ప్రదర్శించాలి,
లోకాన్ని అంతరంగాల్లో
ప్రతిబింబించాలి.

**పొస్తుకం —**
మనసుకు ఆనందం ఇచ్చి
సంతోషపు పూలు పూయించాలి,
భావాల తోటలో రంగులు
వెదజల్లాలి.

**గ్రంథం —**
కర్ణాలకు శ్రావ్యత కలిగించి
మౌనానికీ సంగీతం నేర్పాలి,
జీవన రాగం వినిపించాలి.

**కితాబు —**
నోర్లకు తేనెచుక్కలు అందించి
పదాల మాధుర్యం పంచాలి,
పఠనమే పానీయమై కడుపులకు
తృప్తినివ్వాలి.

**బుక్కు —**
గుండెలకు లయ నేర్పి
వేదనలకు తాళం
వెయ్యాలి,
గమ్యాలను తెలియజేసి
జీవితాన్ని నడిపించాలి.

**పుస్తం —**
హృదయాలను తాకి
ఉత్తమ భావాలకు ప్రాచుర్యం
కలిగించాలి,
ఒక శాశ్వత చిరునామా ఇవ్వాలి.

**పుస్తి—**
మోములపై వెలుగులు చిమ్మి,
నవ్వించి
జీవన పోరాటం చేయించాలి.
విజయానికి మార్గం చూపాలి.

**పొస్కం —**
దేహాల్లో ప్రాణం నిలిపి,
అక్షరాలతో ఊపిరి పొయ్యాలి
మనిషిలో మనిషిని మేల్కొలపాలి.

**పొస్తకం —**
ఖడ్గం కాదు
హస్తాలకు భూషణం కావాలి,
భాషకు ప్రతీకగా మారాలి.

**పొత్తం –**
అక్షరామృత కలశం,
లిఖిత పదాల సంపుటం,
కవుల భావాల
సమ్మిళితం.



- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

# మీకు ఉద్యోగం వచ్చింది.. మరి మాకెప్పుడు...?



ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ఎన్నికల రోజు ఉదయం బూత్ ముందు నిలబడి, వేలిమీద సిరా ముద్ర వేసుకుని ఇంటికి తిరిగివచ్చిన క్షణంతో పౌరుడి బాధ్యత ముగిసిపోతుందని అనుకోవడం ప్రజాస్వామ్య భావనను చాలా పరిమితంగా చూడటమే. నిజానికి ప్రజాస్వామ్యం అనేది నిరంతర ప్రక్రియ. ప్రజలు ఇచ్చిన ఓటుతో ఏర్పడిన ప్రభుత్వం ప్రతి రోజు, ప్రతి నిర్ణయంలో ప్రజల జీవితాలకు జవాబు చెప్పాల్సిన బాధ్యతలో ఉండాలి.

ఓటు అనేది ప్రజల చేతిలో ఉన్న ఒక శక్తివంతమైన ఆయుధం. కానీ ఆ ఆయుధాన్ని ఉపయోగించిన తర్వాత కూడా ప్రజలు మౌనంగా ఉండిపోతే, ప్రజాస్వామ్యం క్రమంగా ఖాళీ అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, విధానాలపై విమర్శ చేయడం, తప్పులను ఎత్తిచూపడం, అవసరమైతే ఉద్యమాల ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచడం,ఇవి ప్రజాస్వామ్యంలో భాగమే. ప్రభుత్వం ప్రజల కోసం ఉందా? లేక ప్రజలే ప్రభుత్వ నిర్ణయాలకు లోబడాలా? అనే ప్రశ్న ప్రతిరోజూ చర్చకు రావాలి.

ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజలదే. ప్రజలు జాగ్రత్తగా ఉన్నప్పుడే ప్రభుత్వాలు బాధ్యతగా పనిచేస్తాయి. కాబట్టి ప్రజాస్వామ్యం అనేది ఒక రోజు జరిగే ఓటింగ్ కార్యక్రమం కాదు, అది ప్రతి రోజు ప్రజలు, ప్రభుత్వం మధ్య నడిచే బాధ్యత–జవాబుదారీ సంబంధం.

ఈ ప్రశ్నలు ఇప్పుడు పుస్తకాలలో ఉండే తాత్విక చర్చలు కావు. ఇవి తెలంగాణలో యువత జీవితాల్లో కనిపిస్తున్న ప్రత్యక్ష వాస్తవాలు. ఇవి యూనివర్సిటీ హాస్టళ్ల గదుల్లో నిద్రలేని రాత్రులుగా మారాయి. నిరుద్యోగ యువత తల్లిదండ్రుల కళ్లలో కనిపించే నిశ్శబ్ద అవమానంగా మారాయి. గ్రామాల్లో టీ స్టాళ్ల దగ్గర "ఏమైంది రా ఉద్యోగాల సంగతి?" అని అడిగే సాధారణ ప్రశ్నలుగా వినిపిస్తున్నాయి. నగరాల రోడ్లపై చేతిలో సర్టిఫికెట్ల ఫైల్ పట్టుకుని తిరుగుతున్న యువత అడుగులుగా మారాయి.

ఇలాంటి వాస్తవాల మధ్య "ప్రజా పాలన" అనే పదం వినిపిస్తే యువత మనసులో ఒక్క సందేహమే తలెత్తుతుంది. ఈ పాలన నిజంగా ప్రజల కోసమా? లేక ప్రజల పేరుతో అధికార మార్పు మాత్రమే జరిగిందా?ఈ సందేహం ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులది కాదు. ఇది ఓటేసిన ప్రజలది. ముఖ్యంగా నిరుద్యోగ యువతది.

నిరుద్యోగం అనేది ఒక గణాంకం కాదు. అది ఒక నిరంతర వేదన. అది ఒక కుటుంబాన్ని లోపల నుంచి తినేసే మౌనమైన విషం. తెలంగాణలో నిరుద్యోగం కొత్త సమస్య కాదు. రాష్ట్ర ఏర్పాటుకు ముందే ఇది ఉద్యమానికి ప్రాణమైన అంశం. "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే నినాదంలో నియామకాలు అంటే ఉద్యోగాలు. ఉద్యోగాలు అంటే యువతకు భవిష్యత్తు. కుటుంబాలకు భద్రత. సమాజానికి స్థిరత్వం.

కానీ ఈ రోజు పాలకులు నిరుద్యోగాన్ని ఒక శాతంలా చూస్తున్నారు. ఒక సర్వే రిపోర్ట్‌లో వచ్చే కాలమ్‌లా చూస్తున్నారు. కానీ యువతకు అది జీవితం. అది ఆకలి. అది అవమానం. అది తల్లిదండ్రుల ముందు తల వంచాల్సిన స్థితి.

ఒక యువకుడు రోజూ ఉదయం లేచి పాత నోటిఫికేషన్ల ఫైళ్లను తిరగేస్తూ " చూస్తున్నప్పుడు తల్లిదండ్రులు ఈసారి అయినా జాబు వస్తుందా?" అని అడుగుతున్నారు . ఒక యువతి, యువకులు అప్పులు చేసి కోచింగ్ ఫీజులు కట్టి పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు. ఇంకొకరు తండ్రి పెన్షన్ మీద ఆధారపడి జీవిస్తూ "నేను భారమయ్యానా?" అనే ప్రశ్నను తనలోనే మోస్తున్నారు.

ఈ దృశ్యాల మధ్య ప్రభుత్వం "విజయవంతమైన ప్రజా పాలన" గురించి ప్రకటనలు చేస్తోంది. ఈ విరోధాభాసమే ఈ రోజు తెలంగాణ యువతను ఆగ్రహంతో కాకపోయినా లోతైన ఆలోచనతో నింపుతోంది.ఒక ఇంట్లో నిరుద్యోగి ఉన్నంత వరకు ఆ ఇంట్లో భద్రత ఉండదు. ఇది గణాంకాల సత్యం కాదు. ఇది సామాజిక సత్యం. ఈ సత్యాన్ని అర్థం చేసుకోని పాలన ప్రజా పాలనగా నిలబడలేను.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ప్రజాస్వామ్యంలో సాధారణ మాటలు కావు. అవి ఓటు అనే విశ్వాసంతో కుదుర్చుకున్న ఒప్పందాలు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరుద్యోగ యువత మద్దతు కీలకం. ఆ యువత నమ్మిన ప్రధాన హామీ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ విడుదల. ఇది చిన్న రాజకీయ వాగ్దానం కాదు. ఇది లక్షల మంది యువత జీవితాలతో కుదుర్చుకున్న ఒప్పందం.

ఆ మాటను నమ్మి యువత ఓటేసింది.
ఆ మాటను నమ్మి ప్రచారం చేసింది.
ఆ మాటను నమ్మి గ్రామాల్లో, కాలేజీల్లో, సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచింది.

కానీ అధికారంలోకి వచ్చాక నెలలు గడుస్తున్నాయి. జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత లేదు. ఎన్ని పోస్టులు? ఎప్పుడు నోటిఫికేషన్లు? ఎప్పుడు పరీక్షలు? ఎప్పుడు నియామకాలు? ఈ ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్న రాజకీయ నాయకులు అంటున్న మాటలు,

"ప్రక్రియలో ఉంది""సమయం పడుతుంది"
"వ్యవస్థను సరిచేస్తున్నాం"

ఈ మాటలు పాలకులకు సౌకర్యంగా ఉండవచ్చు. కానీ ఆకలికి సమయం ఉండదు. నిరుద్యోగానికి గడువు ఉండదు. యువత జీవితం ఫైళ్లలో నడిచే పరిపాలనా ప్రక్రియ కాదు.ఇది కేవలం పరిపాలనా ఆలస్యమా? లేక హామీల అమలులో నిర్లక్ష్యమా?

లేక అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యతలు మారిపోయాయా?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వం. యువత కాదు.

## ప్రజా పాలన అంటే ఏమిటి?

**కేవలం కుర్చీలు మారడం కాదు. ముఖాలు మారడం కాదు. అది పాలన తత్వంలో మార్పు. నిర్ణయాల్లో ప్రజల జీవితాలు కనిపించడం.గత ప్రభుత్వం ఏం చేయలేదో చెప్పడం ప్రజా పాలన కాదు. కొత్త ప్రభుత్వం ఏం చేస్తుందో చూపించడమే ప్రజా పాలన.కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్న ఆరు గ్యారంటీల్లో నిరుద్యోగ యువతకు స్పష్టమైన ఉద్యోగ భద్రత కనిపించకపోవడం ఆందోళనకరం. యువతకు పథకాలు కాదు, ఉద్యోగాలు కావాలి. తాత్కాలిక ఉపశమనాలు కాదు, శాశ్వత గౌరవం కావాలి.**

**ఉద్యోగం లేకుండా యువత జీవించలేరు. యువత లేకుండా రాష్ట్రం ఎదగలేను. ఇది ఆర్థిక సత్యం మాత్రమే కాదు. ఇది చరిత్ర సత్యం.**



ఈ రోజు నిరుద్యోగ యువత మౌనంగా ఎదురు చూస్తోంది. కానీ ఈ మౌనం శాశ్వతం కాదు. చరిత్ర చెబుతోంది . యువత ప్రశ్నిస్తే రాజకీయాలు మారతాయి. నిరుద్యోగం రాజకీయ అంశం కాకపోతే మరే అంశం రాజకీయమవుతుంది? ప్రజా పాలన అనేది ప్రకటన కాదు. అది చర్య.
పోస్టర్లు కాదు. నియామక ఉత్తర్వులు.
మాటలు కాదు. కాలపట్టిక. ఈ రోజు తెలంగాణలో ప్రశ్న ఒక్కటే. ప్రజా పాలన ఎవరి కోసం?
ఈ ప్రశ్న అడుగుతున్నది ప్రతిపక్షం కాదు.
ఈ ప్రశ్న అడుగుతున్నది మీడియా కాదు.
ఈ ప్రశ్న అడుగుతున్నది నిరుద్యోగ యువత.
ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సింది రోడ్లపై ఉన్న యువత కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వమే. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల నుంచి వస్తుంది. ప్రజల జీవితాల్లో మార్పు రాకపోతే ఆ అధికారానికి నైతికత ఉండదు. ప్రజా పాలన ఒక అవకాశం. ఆ అవకాశాన్ని నెరవేర్చకపోతే అదే ప్రజా పాలనపై ప్రజల తీర్పు మున్సిపాలిటీ ఎన్నికలలో వస్తుంది. ఇది హెచ్చరిక కాదు. ఇది చరిత్ర చెప్పే సత్యం.

తెలంగాణ ఉద్యమాన్ని నిలబెట్టిన నినాదం "నీళ్లు, నిధులు, నియామకాలు". కానీ ఈ రోజు అదే నియామకాల విషయంలో పాలకుల నిశ్శబ్దం గట్టిగా వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన నియామకాలకే క్రెడిట్ తీసుకోవడం ప్రజల ఆకాంక్షలకు సమాధానం కాదు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది గతాన్ని లెక్కించడానికి కాదు. భవిష్యత్తును నిర్మించడానికి.ప్రభుత్వం మారితే పాలన మారాలి. పాలన మారకపోతే ప్రజాస్వామ్యం నిర్వీర్యమవుతుంది.ఉద్యమ సమయంలో నిరుద్యోగుల గొంతుగా మాట్లాడిన నేతలు అధికారంలోకి వచ్చాక మౌనంగా ఉండటం ప్రజల్లో తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఇది వ్యక్తిగత విమర్శ కాదు. ఇది ప్రజా ప్రతినిధుల పాత్రపై వేసే ప్రశ్న."మీకు ఉద్యోగం వచ్చింది, మరి మాకెప్పుడు?"

ఈ ప్రశ్న రోడ్లపై ఉన్న యువతది.ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా ప్రజా పాలన విజయవంతమని చెప్పడం ప్రజలను మోసం చేయడమే. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ జెండా మోసిన వారిలో ఎక్కువ మంది నిరుద్యోగులే. వాళ్లకు పదవులు అవసరం లేదు. కావాల్సింది ఒక ఉద్యోగం. ఒక గౌరవమైన జీవితం.నిరుద్యోగ సమస్యకు తెలంగాణలో ఒక స్పష్టమైన సామాజిక ముఖం ఉంది. అది బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు. అగ్రవర్ణాల్లో పేదలు, ఈ వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలే నిజమైన సామాజిక భద్రత. ప్రైవేటీకరణ, కాంట్రాక్టు ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్ విధానాలు వీరిని మరింత అసురక్షితంగా మార్చాయి. పోటీ ప్రపంచంలో ముందుండే వనరులు వీరికి లేవు. విద్యలో, అవకాశాల్లో చరిత్రాత్మక వెనుకబాటు ఉంది.

ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ వంటి పార్టీ విస్మరించలేను. ఎందుకంటే సామాజిక న్యాయం కాంగ్రెస్ రాజకీయ గుర్తింపులో భాగం.బీసీ, ఎస్సీ, ఎస్టీ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా సామాజిక న్యాయం సాధ్యమా? రిజర్వేషన్లు కేవలం నోటిఫికేషన్లలోనే ఉండి నియామకాలు జరగకపోతే వాటి అర్థం ఏమిటి?ఇది కేవలం తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే కాదు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి కూడా వేసే ప్రశ్న. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ యువత, నిరుద్యోగం, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారు. కానీ తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఇవ్వకపోతే ఆ మాటలకు విలువ ఏముంటుంది?

కేంద్రంలో బీజేపీని నిరుద్యోగంపై విమర్శించే కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు అదే యువతను నిరీక్షణలో ఉంచితే అది రాజకీయ ద్వంద్వం కాదా?



- మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

## మీకు తెలుసా?

### చైనాలో "క్యాట్-బాయ్"

చైనాలోని దహువా గ్రామానికి చెందిన నాంగ్ యోహుయి తన నియాన్-పచ్చ కళ్లతో ప్రసిద్ధి చెందాడు. ఆయనకు పూర్తి చీకటిలో కూడా స్పష్టంగా చూడగలిగే శక్తి ఉందని చెబుతారు. ఈ అరుదైన లక్షణం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేపింది, అయితే శాస్త్రవేత్తలు ఇంకా సందేహంతోనే చూస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు

గోస్ట్ ఆర్కిడ్ : ఆకులు లేకుండా గాలిలోనే పెరుగుతుంది. చాలా అరుదుగా పూస్తుంది.





మహబూబ్ నగర్ జిల్లాలో..



వనపర్తిలో..

# కేసీఆర్‌పై అక్రమ వేధింపులు సహించబోం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చట్టవిరుద్ధంగా సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టడాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైకోర్టు నిబంధనల ప్రకారం వ్యక్తి ఎక్కడ ఉంటే అక్కడే విచారణ చేయాల్సి ఉండగా, ఆ నిబంధనలను పక్కన పెట్టి గోడలకు నోటీసులు అంటించడం సరికాదన్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్‌ను వేధింపులకు గురిచేయడం అన్యాయమని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి కేసీఆర్‌కు ఏమాత్రం సంబంధం లేదని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటే అభ్యంతరం లేదని, కానీ ప్రస్తుతం తమ నాయకుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ, పోలీసుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. రెండేళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తామని, తప్పుడు కేసులు, బెదిరింపులకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు. కేసీఆర్‌ను ముట్టుకుంటే తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని, కేసులు, జైళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మహబూబ్‌నగర్ అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందని విమర్శించారు. మేయర్ పదవిని బీఆర్ఎస్‌కు ఇస్తే మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంతియాజ్, రాజేశ్వర్ గౌడ్, నర్సింహులు, వెంకటయ్య, ఆంజనేయులు, రెహమాన్, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, నవకాంత్, మోసిన్ ఖాన్, సుధాకర్ పాల్గొన్నారు.



కాప్రాలో..

**ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు : సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

ముద్ర, వనపర్తి : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణ పేరుతో వేధిస్తున్న చర్యలను నిరసిస్తూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో వైఫల్యం ఎదుర్కొంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు గత రెండేళ్లుగా కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. వ్యక్తిగతంగా ఎంతగా కేసీఆర్‌ను వేధిస్తే అంతగా ప్రజల మద్దతుతో ఆయన మరింత ఎత్తుకు ఎదుగుతారని అన్నారు. కాంగ్రెస్ తన వెకిలి చేష్టలు మానుకోకపోతే పదింతల మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లాను ముట్టుకుంటే అగ్గిరాజేస్తామని స్పష్టం చేశారు. ఈ రాస్తారోకోలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

**- సిట్ నోటీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసనలు**

ముద్ర, కాప్రా : తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై రాజకీయ కక్షతో సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ కాప్రా, నాచారం, మల్లాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, హెచ్‌బీ కాలనీ, కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్లలో బీఆర్ఎస్ ఆదివారం నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఈ చర్యను తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా బీఆర్ఎస్ నేతలు అభివర్ణించారు. కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్ నేతృత్వంలో కాప్రా ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసనలో పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బైరి నవీన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో రోజురోజుకు బలపడుతున్న బీఆర్ఎస్ పార్టీని భయపెట్టాలనే ఉద్దేశంతోనే సిట్ నోటీసుల పేరుతో రాజకీయ డ్రామా నడుస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇంద్రయ్య, గొగికర్ శివకుమార్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ముద్ర, హైదరాబాద్ :** చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సీఆర్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సీఆర్ పాలి క్లినిక్ న్యూ హఫీజ్‌పేట్‌లోని మార్తాండ్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరం క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజని ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో డాక్టర్ సి.అరుణ (గైనకాలజిస్ట్), డాక్టర్ కెజియా (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ రాహిల్ (ఆర్థోపెడిక్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్), డాక్టర్ అజయ్ (డెంటల్), డాక్టర్ ప్రశాంతి (డెంటల్), ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం, అలాగే జెఎస్‌పీఎస్ హోమియోపతి ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి హోమియోపతి వైద్యుల బృందం, డాక్టర్ సునీత (రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్) పాల్గొని సుమారు 350 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరాన్ని నిర్వహించడంలో అల్లావుద్దీన్ పటేల్ సహకారం అందించడంతోపాటు రోగులకు ఉచిత అల్లోపతి మందులు కూడా అందించారు. ఆయన చేసిన కృషి, సేవలకు గాను సీఆర్ పాలి క్లినిక్ తరపున డాక్టర్ రజని శ్రీ అల్లావుద్దీన్ పటేల్‌తోపాటు వాలంటీర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఆర్ పాలి క్లినిక్ సీఓఓ కె.విజయలక్ష్మి పర్యవేక్షించారు. ఈసందర్భంగా డాక్టర్ రజని సీఆర్ పాలి క్లినిక్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది అందరికీ వారి సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కేసీఆర్‌పై నోటీసులు రాజకీయ కుట్రే



- డాక్టర్ మెతుకు ఆనంద్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ చేస్తున్న కుట్రలలో భాగంగానే మరోసారి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నల్ల కండువాలు ధరించి వికారాబాద్ పట్టణంలోని తన నివాసం నుంచి బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్‌తోపాటు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ర్యాలీగా బయలుదేరి బిజెర్ చౌరస్తా వరకు చేరుకున్నారు. అనంతరం రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌ను విచారణ పేరుతో అవమానించడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని బాగు చేసిన కేసీఆర్‌పై కుట్రలు మానుకుని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఆలోచించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఏదో ఒక డ్రామాకు తెరలేపడం మానుకోవాలని హెచ్చరించారు.

# ప్రజావాణి వాయిదా : కలెక్టర్

**ముద్ర, వనపర్తి :** మున్సిపాలిటీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తయి, కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు ఎవరూ రావొద్దని ఆయన తెలిపారు.



## జిల్లాలో ఫిబ్రవరి 28 వరకు "30 పోలీస్ యాక్ట్" అమలు

- ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణను దృష్ట్యా ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ స్నేహ మెహ్రా ప్రకటించారు. ప్రజా జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ చట్టం అమల్లో ఉన్న సమయంలో జిల్లా పరిధిలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు లేదా ప్రజలు గుంపులుగా చేరే కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మిశ్రా మాట్లాడుతూ పండుగలు లేదా రాజకీయ సభల పేరుతో నిర్వహించే ఏ కార్యక్రమమైనా సరే, నిర్వాహకులు కనీసం వారం రోజుల ముందుగా సంబంధిత పోలీసు అధికారులకు దరఖాస్తు చేసుకుని లిఖితపూర్వక అనుమతి పొందాలని సూచించారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టేలా పోస్టులు పెట్టినా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలను షేర్ చేసినా ఐటీ యాక్ట్ మరియు 30 పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# బాల కార్మిక నిర్మూలన ప్రతి పౌరుడి బాధ్యత

- ఎస్పీ సునీత రెడ్డి

**ముద్ర, వనపర్తి :** పిల్లల బాల్యం బడులకు అంకితం కావాలని, బాలలు కార్మికులుగా మారకుండా విద్యా బాటలో నడవాలన్నదే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రధాన లక్ష్యమని ఎస్పీ సునీత రెడ్డి అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వనపర్తి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే "ఆపరేషన్ స్మైల్ 12" అని ఆమె తెలిపారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న తీవ్రమైన సమస్యలలో బాల కార్మిక వ్యవస్థ ఒకటని తెలిపారు. 514 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను కార్మికులుగా పనిచేయించడం వారి ప్రాథమిక హక్కులను హరించినట్లేనని స్పష్టం చేశారు. బాల కార్మికులుగా కొనసాగడం వల్ల పిల్లలు సరైన విద్య, ఆరోగ్యం, భవిష్యత్తులో ఉన్నత జీవితం గడిపే అవకాశాలను కోల్పోతున్నారని అన్నారు. ఎవరైనా బాల కార్మికులు కనిపించినా లేదా పిల్లలు పనిచేస్తున్నట్లు సమాచారం ఉన్నా చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్



1098 లేదా అత్యవసర నెంబర్ 112కు ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజలను ఆమె కోరారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను వెట్టిచాకిరి, బలవంతపు బిక్షాటన, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు తదితర ప్రదేశాల్లో పని చేయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు**

**ముందస్తు అనుమతి లేని ర్యాలీలు, సభలకు నిషేధం**

జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజా వాతావరణం ప్రశాంతంగా కొనసాగడం, అనవసర గుంపులు నివారించడం లక్ష్యంగా ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు 30 పోలీస్ యాక్ట్1861 నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు. జిల్లా పరిధిలో ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం నిషేధించడం జరిగిందని తెలిపారు. ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటు లేదని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# వైభవంగా తిరుకళ్యాణ మహోత్సవం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**ముద్ర, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో రాంకీ గెలాక్సీ అపార్టుమెంట్స్‌లో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల దివ్య తిరుకళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండుగలా వైభవంగా జరిగిందన్నారు. స్వామివారి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, స్వామివారి దయ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజ్, మంత్రిప్రగడ సత్యనారాయణ, చాంద్ పాషా, ఉరిటీ వెంకటరావు, శేఖర్ రెడ్డి, అనిల్, ప్రభాకర్ రెడ్డి, నగేష్, వేణుగోపాల్ రెడ్డి, మల్లేష్, సల్లవుద్దీన్, విశ్వనాథ్, పూరీ, రాజేందర్, సురేష్, లక్ష్మణ్, శ్రీశైలం తదితరులు పాల్గొనగా, భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.




**-నల్లగండ్లలో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో హుడా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ యూత్, స్కంద ఆసుపత్రి, రెటినోవా ఐ కేర్ ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, బాల వైద్యం, ఆర్థోపెడిక్, చర్మ వైద్యం, నేత్ర వైద్యం, న్యూరాలజీ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు కూడా ఉచితంగా అందించడం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులను శాలువలతో సన్మానించారు. చఅలాగే మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 02-02-2026
www.mudranews.in | @mudranews



ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు

యూటా పిచర్ ప్లాంట్



పురుగులను ఆకర్షించి ఆహారంగా తీసుకునే మాంసాహారి ఈ మొక్క. ప్రత్యేకమైన ఆకారంతో ప్రసిద్ధి.

# ఎన్నికల్లో వ్యూహాత్మంగా వ్యవహరించాలి

**- మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



**ముద్ర, తిమ్మాపూర్:**

కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యకుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలో మండల కాంగ్రెస్ అధ్యకుడు బండారి రమేశ్ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేషన్ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, గెలుపు కోసం అందరూ కష్టపడి పని చేయడమే కాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా అంతా పని చేయాలన్నారు. ఆయనకు మద్దతుగా నిర్వహించే ప్రచార కార్యక్రమాల్లో మండలానికి చెందిన పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.


అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల ఒనగూరే ప్రయోజనాలేమిటో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. 8వ డివిజన్‌తో సహా కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఎన్నికల్లో ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తేనే గెలుపు ఖాయమవుతుందన్నారు. 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎలాంటి భేషజాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ పని చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యకుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, మాజీ డివిజన్ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, ప్రశాంత్ గౌడ్, పొన్నాల సంపత్, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్, చింతల లక్ష్మారెడ్డి, తమ్మనవేణి రాములు యాదవ్, ఐతం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ యాప్ సేవలు రైతులు వినియోగించుకోవాలి

**- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం**

**ముద్ర, రాజన్న సిరిసిల్ల:**




రైతులు ఎరువుల కోసం పడే ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ సేవలు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలు సోమ వారం నుండి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ ను రైతులు డౌన్ లోడ్ చేసుకోవాలని, దాని ద్వారానే ఎరువులు బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద వద్ద రైతులకు సహాయం అందించేం దుకు హెల్ప్ డెస్క్, సహాయకుడు ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ యాప్ లో యూరియా బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు. జిల్లాలోఎరు వులకు కొరత లేదని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

**- వాకర్స్ తో నరేందర్ రెడ్డి ముఖాముఖి**



**ముద్ర, కరీంనగర్:**

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, తద్వారా అభివృద్ధికి పట్టం కట్టాలని పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కోరారు. ఆదివారం ఉదయం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ తో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తీసుకుంటున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, సన్న బియ్యం, రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్ళు, రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లాంటి సంక్షేమ పథకాలను ఆయన ప్రస్తావించారు. నగరంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించడానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తున్నదని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఇతర రాష్ట్రాలకు దీటుగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కరీంనగర్ నగర పాలక సంస్థనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

**- మంత్రి 'అడ్లూరి' ఆగ్రహం**

**ముద్ర, హైదరాబాద్:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతా రామన్ ప్రవేశపెట్టిన తాజా కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. ఈ బడ్జెట్ సామాజిక న్యాయ స్ఫూర్తిని దెబ్బతీసిందని ఆయన అన్నారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని బడ్జెట్ స్పష్టం చేస్తోందని వ్యాఖ్యానించారు. ఉపాధి, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో రాష్ట్రం పెట్టుబడులు పెడుతుంటే, కేంద్రం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే "తెలంగాణ రైజింగ్–2047" విజన్‌కు కేంద్ర సహకారం అవసరమని మంత్రి గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తగిన స్పందన ఇవ్వడం లేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లు, గురుకులాలు, ఉపాధి పథకాలకు కేంద్ర మద్దతు లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు తగ్గడం వల్ల దళితులు, ఆదివాసీలు నష్టపోతారని హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని, కేంద్ర నిర్లక్ష్యాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ప్రశ్నిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# బొగ్గు ఉత్పత్తి, రవాణాలో జీడీకే 1, 3 గనులు రికార్డు

**ముద్ర, గోదావరిఖని:**

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ 1 పరిధిలోని జీడికే 1, 3 గనుల్లో రికార్డ్ స్థాయి బొగ్గు ఉత్పత్తితో పాటు సీఎస్పీలో భారీ బొగ్గు రవాణా జరిపి రికార్డ్ సృష్టించినట్లు రామగుండం డివిజన్ 1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీడికే 1, 3 గనుల్లో జనవరి 31న 656 టన్నుల లక్ష్యానికి గాను 703 టన్నులు సాధించి ఈ మొత్తాన్ని రవాణా చేయడంలో విజయం సాధించినట్లు జీఎం పేర్కొన్నారు. 5 ఎస్డీఎల్ యంత్రాలలో, 4 ఎస్టీఎల్ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించి ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం బీఆర్ఎస్ డ్రామాలు

**మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్**

**ముద్ర, ధర్మపురి:**



మున్సిపల్ ఎన్నికల్లో సెంటిమెంట్ ను రగిలించి ఓట్లు దండుకోవడానికి సిట్ విచారణపై మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ డ్రామాలు ఆడుతున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ విచారణపై మంత్రి స్పందించారు. ఫోన్ ట్యాఫింగ్ విషయంలో కేసీఆర్ ను సిట్ విచారణకు పిలిస్తే దేశం కోసం పోరాటం చేసిన వ్యక్తిగా శాంత్రి యాత్రలు ఇంకో యాత్రలు అని పిలుపునిస్తూ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ చేస్తుందని మంత్రి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ చేసి వ్యాపారుల భూములు రాయించుకున్నది, డబ్బులు వసూళ్లు చేసింది నిజం కాదా అని మంత్రి ప్రశ్నించారు. వారు చేసిన పాపాలు కాళేశ్వరం ఒక్కటి అయితే రెండవది ఫోన్ ట్యాపింగ్ అని మంత్రి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత దుర్మార్గమైన చర్యగా మంత్రి అభివర్ణించారు. రాష్ట్రంలో 10 ఏళ్లు అధికారంలో ఉండి కల్వకుంట్ల రాజ్యాన్ని తీసుకువస్తామని భావిస్తే ప్రజలు మార్పు కోరుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని మంత్రి అన్నారు. పదేళ్ల పాటు వారు చేసిన పాపాలు, అక్రమాలు ఒకోక్కటి వెలుగులోకి వస్తుంటే జనం ఆశ్చర్యపోతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. దేశంలోని పేద ప్రజలకు ఉపాధి కల్పించే జాతీయ ఉపాధి హామీ పథకం దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండేంది మంత్రి అన్నారు. పేద ప్రజలకు 100 రోజుల పని కల్పిస్తే ఆ కుటుంబానికి ఎంతో చేయూతగా ఉండేదని ఇలాంటి ఉపాధిహామీని రద్దు చేస్తే ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఎందుకు ఫాంహౌజ్ నుంచి బయటికి వచ్చి కేసీఆర్ మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

వ్యక్తిగతంగా వాళ్లకు నొప్పి అయినప్పుడు మాత్రమే రాష్ట్ర ప్రజలు విపరీతమైన అందోళనలో ఉన్నట్లు బీఆర్ఎస్ మాజీ మంత్రులు వ్యవరిస్తున్నారని అన్నారు. వాస్తవాలు ఎప్పుడు దాగవని, సిట్ ఏలాంటి ఆధారాలు లేకుండా నోటీసులు ఇవ్వదని మంత్రి అడ్లూరి అన్నారు. విచారణ చేస్తేనే మీరు దోషులా.. కాదా.. అనే విషయం తెలుస్తుందని అన్నారు.

చట్టం తన పని తాను చేసుకుంటు పోతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగతంగా తీసు కుంటే ఇప్పటి వరకు బీఆర్ఎస్ నాయ కులు ఒక్కరు రోడ్డు మీద తిరిగే వారు కాదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారపక్షం, ప్రతిపక్షం రెండు ఉండాలని కాంగ్రెస్ పార్టీ కోరు కుంటుందన్నారు. తోడ పుట్టిన చెల్లి, కన్న బిడ్డ ఫోన్ ట్యాపింగ్ పై చేసిన ఆరోపణలకు ముందు సమాధానం చెప్పాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# కనుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు

**- రథాన్ని నడిపిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**ముద్ర, కరీంనగర్:**

ముద్ర, కరీంనగర్: నగరంలోని మార్కెట్ రోడ్ వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా ముగిశాయి. గత కొన్ని రోజులుగా అంగరంగ వైభవంగా సాగిన ఈ వేడుకల్లో చివరి రోజైన ఆదివారం నిర్వహించిన శోభయాత్ర భక్తుల కోలాహలం మధ్య సాగింది.



## ఆధ్యాత్మిక శోభతో మురిసిన మార్కెట్ రోడ్

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అఖిలాండ కోటి బ్రహ్మండ నాయకుని శోభయాత్ర మార్కెట్ రోడ్ ప్రధాన వీధుల గుండా సాగింది. మంగళవాయిద్యాలు, భజన కీర్తనలు, గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## రథం నడిపిన సుడా చైర్మన్

ఈ వేడుకల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారి పట్ల తనకున్న భక్తిని చాటుకుంటూ, ఆయన స్వయంగా స్వామి వారి రథ వాహనాన్ని నడిపించడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ వేంకటేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. "స్వామి వారి సేవలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం. రథాన్ని నడిపించే భాగ్యం కలగడం పట్ల చాలా సంతోషంగా ఉంది." అని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.



## భక్తుల కోలాహలం

నగరంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శోభయాత్ర అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

**- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి**

**ముద్ర, కరీంనగర్:**




స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గణనీయమైన విజయాలు సాధించిందని, ప్రస్తుత పురపాలక సంఘాల ఎన్నికలలోనూ అదే ఒరవడి కొనసాగిస్తుందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఈ ఫలితాలు నిదర్శనం గా నిలుస్తాయని పేర్కొన్నారు. గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 224 మంది అభ్యర్థులను బరిలో దింపగా, 102 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ ఘన విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ప్రజలు తమ పార్టీపై పెట్టుకున్న నమ్మకానికి ప్రతీక అని ఆయన అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2 జడ్పీటీసీ స్థానాలు, 49 ఎంపీటీసీ స్థానాలను ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకోవడం గర్వకారణమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలపై పోరాడినందుకే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు.

గత మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 17 స్థానాలను పార్టీ కైవసం చేసుకుందని తెలిపారు. చొప్పదండిలో 1, పెద్దపల్లిలో 1, రామగుండంలో 9, కరీంనగర్ లో 3, జగిత్యాలలో 1, రాయికల్ లో 2 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ విజయం సాధించిందన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 మంది అభ్యర్థులను బరిలో దింపినట్లు వెల్లడించారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఫార్వర్డ్ బ్లాక్ వైపు చూస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ లో బీఆర్ ఎస్, బీజేపీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పైకి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, లోపల మాత్రం స్పష్టమైన అవగాహనతో వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రజలు ఈ కుమ్మక్కు రాజకీయాలను గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలేవి ప్రజలకు అందడం లేదన్నారు. ఈ ప్రభుత్వ వైఫల్యమే రాబోయే ఎన్నికల్లో తేలిపోతుందని జోజిరెడ్డి చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలిపి, అత్యధిక స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా ఫార్వర్డ్ బ్లాక్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో ఫార్వర్డ్ బ్లాక్ ను మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని అంబటి జోజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు

కోకియా కుకై : హవాయి దీవుల్లో మాత్రమే లభించే మొక్క. అడవుల్లో దాదాపు అంతరించిపోయింది.



# రాజేష్ ది ముమ్మాటికీ హత్యే

- ఎస్సై సురేష్ రెడ్డి ని కాపాడేది మంత్రి ఉత్తమ్?
- రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిచే సమయం డీజీపీ కి లేదా..?
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

**ముద్ర నడిగూడెం:**

కర్ల రాజేష్ మృతి ముమ్మాటికీ పోలీస్ ల హత్యే అని ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సైదులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కర్ల రాజేష్ సంతాప సభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅధితిగా హాజరై మాట్లాడుతూ... సీఎం రిలీఫండ్ కేసులో ఏ4 గా ఉన్న రాజేష్ ను పోలీస్ లు చిత్రహింసలు పెట్టడం తోనే రాజేష్ మరణించాడని అన్నారు. రాజేష్ మృతి కి కారణమైన చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డి ని సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబాన్నికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం చేస్తుంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు మాత్రం రెడ్డి పోలీస్ అధికారులను కాపాడుకునే పనిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు లో రాజేష్ పై కేసు నమోదు నుండి మొదలు పోస్టార్టం వీడియో రికార్డు చేసే వరకు అందరూ రెడ్డి లే ఉన్నారు కాబ్బట్టి ఉత్తమ్ దంపతులు మౌనంగా ఉంటున్నారని అన్నారు. రాజేష్ మృతి పై ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు స్పందించకుంటే రాజేష్ మృతి నే వారికి రాజకీయ సమాధి కడుతుందని హెచ్చరించారు. రాష్ట్రం లో ప్రతిపక్షాలైన బీఆర్ఎస్,



బీజేపీ,సిపిఎం, సిపిఎం అగ్రనాయకులతో పాటు, లాకప్ డెత్ జరిగితే పరామర్శించే సమయం రాష్ట్ర డిజిపి కి దొరకడం లేదా అని ప్రశ్నించారు. ఈ సభ లో హై కోర్టు న్యాయమూర్తి అంబెడ్కర్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఉపేందర్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సత్యనారాయణ, నడిగూడెం మాజీ సర్పంచ్ సుధాకర్,ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్, ఎంజెఎఫ్ నాయకులు రాంబాబు, బీజేపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, జలిల్, మహేష్,ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు అర్జున్,శ్రీను తదితరులు పాల్గొన్నారు



## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐతో కలిసి వెళ్తున్నాం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఐ కలిసి వెళ్తున్నామని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనీల్ కుమార్ రెడ్డి చెప్పారు. ఆదివారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడం లో కమ్యూనిస్ట్ లు ముందంజలో ఉంటారని అన్నారు. రాష్ట్ర వ్యాప్త ఒప్పందంలో భాగంగా పొత్తుతో ఎన్నికల్లోకి వెళ్తున్నామన్నారు.

భువనగిరి, భూదాన్ పోచంపల్లి రెండు మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ జెండా ఎగురావేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా రంజక పాలన కు కేరఫ్ అడ్రెస్స్ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రజా ప్రభుత్వమని ప్రజలు గమనించాలని హెచ్ఎండిఏ కింద 56కోట్ల నిధులు తెచ్చిన ఘనత మాకుందన్నారు. అధికారం లోకి రాగానే పట్టణంలో బృహత్తర కార్యక్రమాలు చెప్పట్టి అభివృద్ధి అంటే ఏంటో చూపించాం...ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. బిఆర్ఎస్ హయాంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ చేస్తుందని

కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడి ఫోన్ ట్యాపింగ్ చేశారని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తంగేళ్లపల్లి రవికుమార్, ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, కూర వెంకటేష్, సిపిఐ నాయకులు గోదా శ్రీరాములు, ఏశాల అశోక్ పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో న్యాయం

- రామన్నపేటలో కోర్టుల భవన సముదాయానికి జస్టిస్ పి శ్యామ్ కోసి కే శరత్ శంకుస్థాపన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రజలకు అందుబాటులో న్యాయాన్ని తీసుకొచ్చే కృషి చేస్తున్నట్లు జస్టిస్ పి శ్యామ్ కోసి కే శరత్ అన్నారు. ఆదివారం రామన్నపేటలో నాలుగు కోర్టు ల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ప్రజలకు అందుబాటులో న్యాయాన్ని తీసుకొచ్చే కృషి చేస్తున్నామని ఆ విధంగా ఒక్కొక్క కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు. జస్టిస్ కూనూరు లక్ష్మణ్ మాట్లాడుతూ.. రామన్నపేటలో భవన సముదాయం త్వరగా నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అన్నారు. నిర్మాణంలో అనేక ఆటంకాలు ఉంటాయనించి వాటన్నిటినీ అధిగమించి పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి విజయసేన్ రెడ్డి, జస్టిస్ సృజన, కళాసికం, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ హనుమంత రావు, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, సీనియర్ సివిల్ జడ్జ్ జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్స్ సివిల్ జడ్జ్ ఎస్.శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, సీనియర్ న్యాయవాదులు యపల కృష్ణారెడ్డి, అశోక్ కుమార్, కంపాటి యాదగిరి ఉపాధ్యక్షులు యాదాసు యాదయ్య, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మోగులయ్య, జినుకల ప్రభాకర్, హనుమంతు గౌడ్,రామదాసు, ప్యానల్ లాయర్ మామిడి వెంకటరెడ్డి, ఏజిపి సుక్క శ్రవణ్ కుమార్, బి.అశోక్ కుమార్, జగతయ్య, డేవిడ్, బాలరాజు, దినేష్, శ్రీశైలం, స్వామి, రమేష్, అజీజ్, జితేందర్, తదితరులు పాల్గొన్నారు.





## రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనం
- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అక్కినపల్లి

**ముద్ర, చిలుకూరు:**

కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కెసిఆర్ పై తప్పుడు కేసులను బనాయిస్తుందని, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అక్కినపల్లి జానకి రామాచారి అన్నారు. ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలో కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి నల్లజెండాలతో రాస్తారోకో నిర్వహించారు. అక్కినపల్లి జానకి రామాచారి మాట్లాడుతూ, ఫోన్ టాపింగ్ కేసు పేరుతో ప్రతిపక్షాన్ని భయపెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు అవమానమని, కెసీఆర్ పై సిట్టు అధికారుల దర్యాప్తు ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శమని అన్నారు. కెసిఆర్ ని ఎదుర్కోలేక కాంగ్రెస్ బిజెపి తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ ప్రభుత్వం తమ పబ్బం గడుపుకోవటానికి ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న కేటీఆర్, హరీష్ రావు, సంతోష్, కేసీఆర్ పై అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వ భయానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ అన్నపూర్ణ, మాజీ జెడ్పిటిసి బట్టు శివాజీ నాయక్, మాజీ జడ్పి కోఆప్షన్ సభ్యులు ఎస్.కె జానీ మియా, పిఎసిఎస్ మాజీ చైర్మన్ అలసకాని జనార్ధన్, తాళ్లూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, వార్డ్ మెంబర్ అల్లి వీరబాబు, షాకీర్, ఎస్.కె పాషా, వాసు, రవీందర్, నందలాల్, శంకర్, పిచ్చయ్య, నాగేంద్ర, హరిబాబు,మాదారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెంలో బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ

**ముద్ర, కొత్తగూడెం:**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు సిట్ పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యాన కొత్తగూడెంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, నాయకులు శాంతి నాయక్,కార్యకర్తలు గులాబీ,నల్ల కండువాలు ధరించి రేవంత్ రెడ్డి సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.



## సరిత మల్లేష్‌ను గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల్లో 28వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గుమ్ముల సరిత మల్లేష్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 28వ వార్డ్ ఇన్చార్జ్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని మున్సిపల్ సీటును కైవసం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ వెల్దుర్తి రఘు, వార్డు అధ్యక్షుడు నర్సిరెడ్డి, హీరేకర్ అమర్నాథ్, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

దివ్యాంగులు ఉపకరణాలకు దరఖాస్తు చేసువాలని మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా అధికారి కే. నర్సింహారావు తెలిపారు. మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిళ్లు, హైబ్రిడ్ వీల్చైర్ అటాచ్మెంట్లు, ల్యాప్‌టాప్‌లు (డిగ్రీ, ఉన్నత విద్య), ల్యాప్‌టాప్‌లు (సాంకేతిక విద్యార్థులకు), ట్యాబ్లు కొరకు ఈ నెల 10వరకు పొడగించడమైనదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని అర్హులు ఓబీ ఎంఎంఎస్ పోర్టల్ (TGOBMMS) ద్వారా దరఖా స్తులు చేసుకోవాలని సూచించారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి నిత్య కళ్యాణోత్సవం ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శరణాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రాతఃకాలంలో అర్చక సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలు చేశారు. శ్రీ సుదర్శన నారసింహ హవనం, సాయంకాలంలో శ్రీ వారిని గరుడ వాహనం మీద అధిరోహింప చేసి ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి భక్తుల



గోవింద నామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన

**ముద్ర, నడిగూడెం:**

మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశాలతో మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని వ్యక్తిగతంగా అగౌరవపరచడమే ఏకైక లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని అన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ చట్టాలను సైతం లెక్కచేయకుండా న్యాయవ్యవస్థను కించపరుస్తూ సిట్ నోటీసుల పేరుతో దుర్మార్గంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలతో మాయమాటలతో ఆరు గ్యారెంటీలు 420 అబద్ధపు హామీలతో పబ్బం గడుపుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టే దిశగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ నాయకులు అనంతుల ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్, మాజీ సర్పంచ్ దున్న సుధాకర్, బి ఆర్ ఎస్ నాయకులు దున్న ప్రవీణ్, మహమ్మద్ రఫీ బడి ఏటి శ్రీను,వల్లెపు శ్రీను, మేకల వీరబాబు, ఎస్కే జలీల్, దున్న రవి, కన్నెబోయిన మురళీకృష్ణ,బడుగుల వెంకటేష్,పాతకోట్ల మహేష్,మండవ అనిల్, దున్న అర్జున్,చిమట మహేష్ తదితరులు పాల్గొన్నారు.







## టెన్త్ విద్యార్థుల టాలెంట్ టెస్ట్ విజయవంతం

**ముద్ర, చిలుకూరు:**

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిలుకూరు మండల కేంద్రంలోని కవిత జూనియర్ కళాశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ విజయవంతమైందని ఆయా సంఘాల జిల్లా బాధ్యులు చేపూరి కొండలు, తమ్మనబోయిన నరేష్ తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ కు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 887, మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. టాలెంట్ టెస్ట్ ప్రారంభానికి ముందు సిపిఐ సీనియర్ నాయకులు కస్తూరి సైదులు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అంబాల వెంకటి ల చేతుల మీదగా ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టాలెంట్ టెస్టులు విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీయటానికి దోహద పడతాయని అన్నారు. టాలెంట్ టెస్ట్ విజేతలకు ఈనెల 5న బహుమతులు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు, కవిత జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మాదాల శ్రీధర్, చిలువేరు ఆంజనేయులు, సిరాపురపు శ్రీనివాసరావు, కొల్లు శ్రీనివాస్, ఎస్ టి యు నాయకులు కొండ వెంకయ్య, ఏఐవైఎఫ్ చిలుకూరు మండల అధ్యక్ష కార్యదర్శులు, అనంతుల రాము, కడారు మధు, వెంకటేష్, సాకి నరేష్, డేగ వీరన్న, కొల్లు శ్రీకాంత్, వెంకటలక్ష్మి, సాయి వర్షిత, అనూష, నిక్షిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## నాయకపోడు నిరుద్యోగ యువత కోసం..

- గురు–శిష్య హస్తశిల్ప శిక్షణ
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితిష్ వి. పాటిల్

**ముద్ర, భద్రాద్రి జిల్లా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకపోడు మాస్కల తయారీ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జితిష్ వి.పాటిల్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో తయారవుతున్న నాయకపోడు మాస్కల తయారీ ప్రక్రియను పరిశీలించి, కళాకారులతో పరస్పరంగా మాట్లాడి వారి అనుభవాలు, సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.., మాదారం గ్రామంలో తయారవుతున్న నాయకపోడు మాస్కలు నాయకపోడు సంస్కృతి, సంప్రదాయ కళలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపారు. ఈ సంప్రదాయ హస్తకళను పరిరక్షిస్తూ మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పాటు, మండలంలో ఉన్న నాయకపోడు నిరుద్యోగ యువతీ-యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో “గురు-శిష్య హస్తశిల్ప శిక్షణ కార్యక్రమం”ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభమవుతుందని, తొలి దశలో 30 మంది నాయకపోడు నిరుద్యోగ యువతీ-యువకులతో రెండు నెలలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి శిక్షణార్థికి రోజుకు రూ.300 చొప్పున స్కాలర్‌షిప్ అందజేయబడుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో సంప్రదాయ నాయకపోడు మాస్క్ తయారీతో పాటు నాణ్యత మెరుగుదల, ఆధునిక డిజైన్‌లు, మార్కెటింగ్ అంశాలపై కూడా ప్రాయోగిక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం శిక్షణార్థులు స్వయం ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు



ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంప్రదాయ హస్తకళలకు మార్కెట్ అవకాశాలు పెంచడంతో పాటు స్థానిక యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు
జేడ్ వైన్ : ఆకుపచ్చ నీలి రంగు పువ్వులతో అద్భుతంగా కనిపిస్తుంది. పరాగసంపర్కం తగ్గడంతో అరుదైంది.



# ప్రజల ఆకాంక్షలను మరిచిన కాంగ్రెస్

- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి
- ఫొటో: ఎక్స్ డిప్యూటీ స్పీకర్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి ప్రశ్నించిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతూ ఆరాచక పాలన సాగిస్తోందని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి, మెదక్ ఎన్నికల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఆరోపించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పై రేవంత్ సర్కార్ అక్రమంగా కేసులు పెడుతోందని ఆరోపించారు. ఉద్యమ నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ పేరుతో వేధిస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌కు సిట్ నోటీస్ జారీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఖండించారు. ప్రజలిచ్చిన పదవిని గౌరవించకుండా, ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తుల పేరుతో వేధింపులకు పాల్పడటం సరికాదన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరగాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా సిట్ వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఏ హామీని సక్రమంగా అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించటానికి ఫోన్ ట్యాపింగ్ పేరుతో తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై కక్షకట్టి వేధింపులకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రంలో రైతులకు సక్రమంగా యూరియా అందించలేని చేతగాని ప్రభుత్వముందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం పోయి, రాక్షస రాజ్యం వచ్చిందని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన, ప్రజల కష్టాలను తీర్చిన వ్యక్తి గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. పదేళ్లు కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి పథకంలో నడిపించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్ గౌడ్, బట్టి జగపతి, పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు విజయలక్ష్మి, మాయ మల్లేశం, భీమరి కిషోర్, నాయకులు జీవన్ రావు, సురేందర్ గౌడ్, జుబెర్ అహ్మద్, తుమ్మ లక్ష్మీనారాయణ, ఇస్మాయిల్, సంతోష్, నరేష్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# కేసీఆర్ ను టచ్ చేస్తే అగ్నిగుండమే

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

మాజీ సీఎం కేసీఆర్ ను టచ్ చేస్తే తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.కేసీఆర్ ను సిట్ పేరిట విచారించడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం సిద్దిపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. సిద్దిపేట లోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. సిద్దిపేట పట్టణంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్ల జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం పై నేడు తెలంగాణ పల్లెలు కన్నీరు పెడుతున్నాయని తెలిపారు. రేవంత్ రెడ్డి గతంలో చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఈ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి రివెంజ్ రెడ్డిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కు నోటీస్ ఇవ్వడం అంటేనే బ్లాక్ డే అని, చరిత్ర తిరగరాస్తే ఎవరికి పుట్టగతులు ఉండవన్నారు. తెలంగాణ కోసం ఏ ఒక్క కాంగ్రెస్ మంత్రి పోరాటం చేయలేదని విమర్శించారు.



# వీరశైవ లింగాయత్ సమాజ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

వీరశైవ లింగాయత్ సమాజ జిల్లా అధ్యక్షుడిగా మహాదేవుని శ్రీనివాస్ (కొమురవెల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వీరశైవ లింగాయత్ సమాజ భవనంలో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో అధ్యక్షునిగా మహాదేవుని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆకుల ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పదవి బాధ్యతగా భావించి జిల్లాలోని అన్ని వర్గాలను కలుపుకొని సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో రుద్రభూమి, బసవ భవనం ఏర్పాటు కోసం రాష్ట్రస్థాయి పెద్దల సహకారంతో ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచిన జిల్లాలోని వీరశైవులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలను సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు నరుకుల శివప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆకుల భద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ కమిటీ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో సమ్మె ప్రిపరేషన్ జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, బీ ఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గానికి కష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని దుయ్యబట్టారు.ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 2020 లో రద్దుచేసి, ఈ లేబర్ కోడ్ లను అమలు చేయాలని నోటిఫికేషన్ విడుదల చేసిందని మండిపడ్డారు. లేబర్ కోడ్ లు అమల్లోకి వస్తే కార్మిక సంఘాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. కార్మికుడి ప్రశ్నించే తత్వమే కోల్పోతుంద న్నారు. ఇప్పటివరకు ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి ఎర్రజెండా కొట్లాడి సాధించిన ఎనిమిది గంటల పనికి మంగళం పాడి, నేడు 10 గంటలు పని పొడిగించారని తెలిపారు. కార్మికుడి కుటుంబం బతకాలంటే 11 వేల రూపాయలు అమలు చేస్తున్నారని, అవి కూడా సరిపోవన్నారు. ఐఎల్ఓ నిబంధన ప్రకారం ఒక కుటుంబానికి 26 వేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని చెప్తుంటే, మినిమం వెజ్ కోడ్ లో కనీస వేతనం నెలకు రూ. 4,676 మాత్రమే చెల్లించాలని పొందుపరిచరని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ నల్ల బ్యాడ్జిలతో బైక్ ర్యాలీ

- పాల్గొన్న పద్మ, ఫారూఖ్ హుస్సేన్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను సిట్ విచారించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు నల్ల జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి, మెదక్ ఎన్నికల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు, వివిధ వార్డుల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మందులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పీహెచ్ సీల్లో మందులన్నీ అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యాధికారులకు ఆదేశించారు. ఆయన మెదక్ జిల్లా టేక్మాల్ పీహెచ్ సీ ఆదివారం తనిఖీ చేశారు. మందుల గదితో పాటు రోగుల రుములు, వైద్యుల హాజరు పట్టికలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల గురించి అడిగారు. డ్యూటీ డాక్టర్ ఎవరు, రాత్రి వేళలో ఎంతమంది వైద్యులు, సిబ్బంది ఉంటున్నారని వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు

# రాజ్యాంగ విలువలను పట్టించుకోని కేంద్రం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను పట్టించుకోవడం లేదని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం ఆరోపించారు. ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేసేందుకు గాను జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్ లో ఆదివారం సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అథితిగా హాజరైన మల్లేశం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తోందని దుయ్యబట్టారు. ఎన్ డీఏ ప్రభుత్వం స్వాతంత్రం పూర్వం సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చిందని దుయ్యబట్టారు. అదే రకంగా వ్యవసాయ చట్టాలను మార్పు చేయడం కోసం నల్ల చట్టాలను తెస్తే, రైతాంగం పెద్ద ఎత్తున పోరాడి సాధించుకున్నాయని గుర్తు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పేరు మార్చడమే కాకుండా, పథకం మౌలిక స్వరూపాన్ని మార్చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన నిధుల వాటాను తగ్గించి చేతులు దులుపుకుందన్నారు. రైతుల వ్యవసాయ బావుల మోటార్లకు మీటర్లు పెట్టాలని ఉద్దేశం తోనే విద్యుత్ సవరణ బిల్లు తెచ్చారన్నారు. అలాగే విత్తన సవరణ బిల్లు సైతం తీసుకు వచ్చరన్నారు. దీంతో రైతులు నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి పంట నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, టౌన్ కార్యదర్శి సంతోష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోరంకల మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏడుపాయలలో పల్లకీ సేవ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ మాత సన్నిధిలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాజగోపురం నుంచి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి నామస్మరణ మారు మోగింది.

# బీజేపీ 22 మంది అభ్యర్థుల ప్రకటన

**ముద్ర ప్రతినిధి, మెదక్:**


మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డులకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్ రావు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. వార్డుల వారీగా 1. మస్కూరి ఆండాలు, 2. రాంసింగ్, 3. బుద్ధి చంద్రకళ, 4. నవిత, 5. ఆముద సాయి, 8. కొజ్జాపురం లావణ్య, 10. పి.దీక్ష, 11. నవిత, 12. బక్కవారి నిర్మల, 13. చైతన్య, 14. నాయిని యశోద ప్రసాద్, 15. గుప్తా నర్సింలు, 16 చంద్రశేఖర్, 17. కిచ్చి లక్ష్మీకౌర్, 21. పబ్బ రాజమణి, 23 గుండు రేఖ, 25. పి.మనోజ్ కుమార్, 26. సైదులు, 27. ఉషారాణి, 29. చౌదరి రమేష్, 30. బి. ఆంజనేయులు, 31. సుంకోజు రాజు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు**

బాంబాబ్ చెట్టు కొన్ని జాతులు : వేల లీటర్ల నీటిని నిల్వ చేసుకుంటుంది. వాతావరణ మార్పుల వల్ల కొన్ని జాతులు ప్రమాదంలో ఉన్నాయి.



# సౌమ్య కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా

- ఆమె తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ భౌతికకాయానికి మంత్రి జూపల్లి నివాళి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి చనిపోయిన నిజామాబాద్ కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో సౌమ్య భౌతికకాయానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్య లేని లోటు భర్తీ చేయలేనిదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆమె తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సౌమ్య సర్వీస్ కాలం అంటే రిటైర్మెంట్ వయసు వరకూ వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఒక్కరోజు వేతనాన్ని సౌమ్య కుంటుంబ సభ్యులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని, తమ సహచరిని కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత ప్రభుత్వ కర్తవ్యమని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల జోలికి వచ్చే దుండగుల వెన్నువణికించేలా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాలు ఇచ్చే నిర్ణయం తమ ప్రభుత్వ పరిశీలనలో ఉందన్న ఆయన త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల ముఠాల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి రెండు నిముషాల మౌనం పాటించి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ శాఖ అధికారుల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు..**

నిజామాబాద్ జిల్లా మోస్రా మండలానికి చెందిన సౌమ్య, జనవరి 23న మాధవనగర్ వద్ద గంజాయి తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నంలో స్మగ్లర్ల కారు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఎనిమిది రోజుల పాటు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన ఆమె శనివారం రాత్రి 9:41 గంటలకు తుదిశ్వాస విడిచారు. విధి నిర్వణహలో విరోచితంగా వ్యవహరించిన సౌమ్య మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్మగ్లర్ల దౌర్జన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులను వదిలిపెట్టవద్దని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. గాజుల సౌమ్య (23) భౌతిక కాయానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ధైర్యసాహసాలను కొనియాడిన సీఎం, ఈ మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కాగా సౌమ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**సెల్యూట్.. సౌమ్య: నగర సీపీ సజ్జనార్**



తన ప్రాణాలను పణంగా పెట్టి స్మగ్లర్ల చేతిలో గాయపడి చికిత్సపొందుతూ గాజుల సౌమ్య మృతి చెందడం బాధాకరమని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మత్తు రక్కసిని అంతం చేసేందుకు ఆమె చూపిన సాహసం వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ ఘటన కేవలం ఒక విషాదం మాత్రమే కాదన్న సజ్జనార్ గంజాయి మాఫియా ఎంతలా పేట్రేగిపోతుందో చెప్పడానికి నిదర్శనమని పేర్కొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల ముప్పు సమాజానికి ఎంతటి ప్రమాదకరంగా మారిందో సౌమ్య మరణం హెచ్చరిస్తోందని ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. విధి నిర్వహణలో అమరురులైన సౌమ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.




# టెట్ పై ఢిల్లీలో జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం

- ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు ఏ.వి.సుధాకర్

**ముద్ర న్యూస్:**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో ఢిల్లీలో ఉమ్మడి పోరాటం చేయనున్నట్లు ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏ.వి.సుధాకర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లోని ఎస్టీయూ భవన్ లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయిస్తూ పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో చట్ట సవరణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం అమలు తేదీకి ముందు నియామకమైన ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి తీర్పు వచ్చిందని అభిప్రాయపడ్డారు. తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తోందని, దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. టెట్ పై కొందరు ఎంపీ లు పార్లమెంటులో ప్రస్తావించినప్పటికి ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో అల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (AIJACTO) అధ్వర్యంలో ఉమ్మడి ఉద్యమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ లో ఈ నెల 5న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టపాక ప్రవీణ్ కుమార్, సత్తు పాండు రంగారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమేష్, ఆల్ ఇండియా స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎన్. పరమేశ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు విడుదల

- రూ.720 కోట్లు రిలీజ్ చేసిన ప్రభుత్వం
- 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మనేటి పెండింగ్ ఒకేసారి క్లియర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటీగా అమలు చేస్తూ వస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు గ్రీన్ ఛానల్ లో పెండింగ్ నిధులను నెలవారీగా విడుదల చేస్తూ వస్తుంది. తాజాగా ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ. 720 కోట్లు విడుదల చేసింది. జనవరి మాసానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ. 720 కోట్లు విడుదల చేశారు. గత ప్రభుత్వానికి ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలకు సంబంధించి ప్రతి నెల రూ.700 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. గత సంవత్సరం జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. తాజాగా విడుదల చేసిన నిధుల్లో 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మనేటి పెండింగ్ మొత్తం ఒకేసారి క్లియర్ చేసింది. వీటితోపాటు విడుదలైన బిల్లులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్ లు, అడ్వాన్సులు ఉన్నాయి.

# తెలంగాణకు రిక్తహస్తం

- కార్పొరేట్లకు వరంగా బడ్జెట్
- సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో విమర్శించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు వరంగా మారిందని ఆరోపించారు. కేంద్ర వార్షిక బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్న ఆయన దీన్ని నిరాశజనక బడ్జెట్ అని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర హక్కుల సాధన కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతామని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వేల కోట్ల రూపాయల పన్నులు వెళ్తున్నప్పటికీ, తిరిగి నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూపిందని ఆయన మండిపడ్డారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనమన్నారు. వ్యవసాయ ఆధారిత దేశంలో రైతుల సంక్షేమాన్ని కేంద్రం గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర చట్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. పోచంపల్లి, నారాయణపూర్, పుట్టపాక వంటి ప్రాంతాల్లోని చేనేత కార్మికులు ఎప్పటి నుండో కోరుతున్నట్లుగా, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తి వేయకపోవడం శోచనీయమన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ బాధితుల పునరావాసానికి లేదా ఫ్లోరోసిస్ రీసెర్చ్ సెంటర్ బలోపేతానికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణకు సంబంధించి కేంద్ర వాటా నిధులపై స్పష్టత లేదని దుయ్యబట్టారు.

**ధరల పెరుగుదల..**

పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడంతో నిత్యావసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయని నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే, యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట ప్రణాళికలేవీ ఈ బడ్జెట్‌లో లేవన్నారు. తెలంగాణకు రైల్వే లైన్లు, కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయాల అభివృద్ధి, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రో కారిడార్, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, కొత్త జాతీయ రహదారులకు బడ్జెట్ లో ఏమాత్రం కేటాయింపులు లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వంపై వివక్ష చూపిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పై మండిపడ్డారు. యువత, మహిళ సంస్కరణలను ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ తొమ్మిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్పా.. పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు, మహిళలకు ఒరిగిందేమి లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

# ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన బీఆర్ఎస్ నాయకులు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఫోన్ ట్యాపింగ్ కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన బీఆర్ఎస్ నేతలు సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొడుతున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ఆయన ఆదివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ను సిట్ విచారణ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలపై స్పందించారు. రాజకీయ కక్ష సాధించాలనే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే, ఈ రెండేళ్లు మీరు రోడ్డు మీద తిరిగేవాళ్లు కాదని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చేసిన పాపాలకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని స్పష్టం చేశారు. అసలు తప్పే చేయని బీఆర్ఎస్ నాయకులకు సిట్ విచారణ అంటే ఎందుకంత భయమని నిలదీశారు. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకుంటున్నారని విమర్శించారు.



# అనంతగిరిలో ఏకో టూరిజం అభివృద్ధికి కృషి

- రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ సువర్ణ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లా అనంతగిరి ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర అటవీ శాఖ కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఆదివారం అనంతగిరి, మోత్కుపల్లి, పరిగి తదితర అటవీ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్, చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి ఎకో టూరిజం పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు తగు సూచనలు చేశారు. నగరవన్ యోజన పథకం కింద కొడంగల్ రేంజ్‌లో అప్పాయిపల్లి, పరిగి రేంజ్‌లో జాఫర్‌పల్లి, తాండూర్ రేంజ్‌లో గొట్లపల్లి అంతారం, వికారాబాద్ రేంజ్‌లో అనంతగిరి అర్బన్ పార్కుల అభివృద్ధి జరుగుతోందని సువర్ణ తెలిపారు. కాంపా నిధులతో కొడంగల్ రేంజ్ బొంరాస్‌పేట్‌లో మరో అర్బన్ పార్క్ ఏర్పాటుకు పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. వికారాబాద్ రేంజ్‌లోని మోత్కుపల్లి సెక్షన్, ఎంకతల గడ్డి భూములను ఆమె పరిశీలించారు. ప్రైవేటు క్వారీలో గూడు కట్టిన అరుదైన పక్షి జాతి ఇండియన్ రాక్ ఈగిల్-ఔల్‌ను గుర్తించిన వన్యప్రాణి ఫోటోగ్రాఫర్ మనోజ్ విట్టేపునిని, ఆ పక్షి పిల్లలు ఎగిరే వరకు క్వారీ పనులను నిలిపివేసి పరిరక్షణకు సహకరించిన క్వారీ యజమాని లక్ష్మారెడ్డిని అటవీ శాఖ అధికారులు అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వికారాబాద్ జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని డాక్టర్ ప్రియాంక వర్గీస్ పేర్కొంటూ, పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, వికారాబాద్ రేంజ్ అధికారి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన చదువుకో తెలంగాణ కార్యక్రమ పోస్టర్ ను ఆదివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మిషన్ టెన్త్ క్లాస్ లో భాగంగా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా, తాలూక, మండల స్థాయిల్లో విభాగాల వారీగా ఉత్తమ ప్రతిభ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2.2 కోట్ల నగదు బహుమతి అందించేందుకుగాను ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ మేరకు సంగారెడ్డిలో పోస్టర్ ను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకం అందించడం అభినందనీయమన్నారు. అంతే కాకుండా శ్రీరామ్ గ్రూప్ ఫౌండర్ త్యాగరాజన్ బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక రంగంలో ఎనలేని సేవలు అందించిన విలువలతో కూడిన వ్యక్తి అన్నారు. అందుకు అనుగుణంగా గ్రామ స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆ దిశగా నగదు ప్రోత్సాహకాలు అందించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంగారెడ్డి రీజినల్ మేనేజర్ విజయకుమార్, నారాయణఖేడ్ యూనిట్ మేనేజర్ పూర్ణచందర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ వేల్పుల ప్రవీణ్, సేల్స్ ఆఫీసర్లు మతిన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.




# శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన






**ముద్ర, శేరిలింగంపల్లి:**

శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా యునైటెడ్ స్టేట్స్ నుంచి వచ్చిన కూచిపూడి కళాకారిణి కుమారి వృందా వూటుకూరి తన కూచిపూడి ప్రదర్శనలో శ్రీ గణపతిం, అలిమేలు మంగ, కొలువై ఉన్నాడే అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి దుర్గేష్ నందిని శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో జయము జయము, వినాయక కౌతం, సాధించెనే ఓ శారదా భుజంగం, మరకత, అష్టపది, నిర్వాణం శతకం అంశాలను సంయుక్త, అద్వైత, భవజ్ఞ, గీతికా, సాహితి, మహి వర్ణిక, హెష్ణ, ఏష, స్వాతి, అంజనీ, జయ, సాధికా, శాన్వి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. తన కూచిపూడి ప్రదర్శనలో శ్రీ గణపతిం, అలిమేలు మంగ, కొలువై ఉన్నాడే అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి దుర్గేష్ నందిని గారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో జయము జయము, వినాయక కౌతం, సాధించెనే ఓ శారదా భుజంగం, మరకత, అష్టపది, నిర్వాణం శతకం అంశాలను సంయుక్త, అద్వైత, భవజ్ఞ, గీతికా, సాహితి, మహి వర్ణిక, హెష్ణ, ఏష, స్వాతి, అంజనీ, జయ, సాధికా, శాన్వి మొదలైన ప్రదర్శించి మెప్పించారు.

ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు

చాక్లెట్ కోస్మోస్ : చాక్లెట్ వాసన వచ్చే పువ్వులు కలిగి ఉంటుంది. సహజంగా ఇప్పుడు అంతరించిపోయింది.



# కేసీఆర్ అనుమతితోనే ఫోన్ ట్యాపింగ్

- మంత్రి వాకిటి శ్రీహరి
- తప్పు చేయకపోతే 42 హార్డ్ డిస్క్‌లను ఎందుకు ధ్వంసం చేశారు?
- నిజాయితీపరుడైతే ట్యాపింగ్ కేసులో కడిగిన ముత్యంలా బయటకు రావాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. కేసీఆర్ కు నిబద్ధత, నిజాయితీ ఉంటే ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో కడిగిన ముత్యంలా బయటకు రావాలనిసవాల్ విసిరారు. తప్పు చేయకపోతే డిసెంబర్ 4న ఎస్ఐబీ ఆఫీస్‌లో సీసీ కెమెరాలు ఎందుకు ఆఫ్ చేశారు? 42 హార్డ్ డిస్క్‌లను ఎందుకు ధ్వంసం చేశారు? అని నిలదీశారు. వందల ఫైళ్లను ఎందుకు నాశనం చేశారు? అని ప్రశ్నించారు. సీఎం అనుమతి లేకుండా ఇజ్రాయెల్ నుంచి పరికరాలు తెచ్చి ఇంత పెద్ద ఎత్తున ఫోన్ ట్యాపింగ్ చేయడం సాధ్యం కాదన్నారు. ఈ ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఓడిపోయిన వెంటనే ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ధ్వంసం చేశారని ఆరోపించారు. అదే వారు గెలిచుంటే ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతూనే ఉండేదని వ్యాఖ్యానించారు. సామాన్య ప్రజల ఫోన్లు, వ్యాపారుల ఫోన్లు, జర్నలిస్టుల ఫోన్లు, సినీనటుల ఫోన్లు, చివరికి భార్య భర్తల ఫోన్లు ట్యాప్ చేయడం నీచమన్నారు.

**ట్యాపింగ్ దొంగల ముఠా నాయకులు కేసీఆర్...**

కేసీఆర్‌ను విచారణకు పిలిస్తే బీఆర్ఎస్ డ్రామా చేస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. ట్యాపింగ్ దొంగల ముఠా నాయకుడు కేసీఆర్ అని తెలిపిందని, దిష్టి బొమ్మలు దగ్ధం చేస్తే రేవంత్ రెడ్డి భయపడతారా? అని మండిపడ్డారు. ఇజ్రాయెల్ నుంచి ఎందుకు ట్యాపింగ్ పరికరాలు తెచ్చారు? అధికారం పోయాక ఎందుకు నాశనం చేశారు? కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫ్రెండ్ ఫోన్ ట్యాప్ చేసి 13కోట్లు వసూలు చేశారు.. బీజేపీ నాయకులు రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్ లాంటి వారి ఫోన్లు ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. సొంత అల్లుడి ఫోన్ ఎందుకు ట్యాప్ చేశారో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నించాలని, తెలంగాణ ఆత్మగౌరవం అంటే బీఆర్ఎస్ కాదన్నారు. కూలీ బ్యాచ్ ను పెట్టి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కాంగ్రెస్ భయపడదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హెచ్చరించారు.



# మీరేనా... ఆ పెద్దాయన...?

- ఫోన్ ట్యాపింగ్ లో మీ ప్రమేయం ఎంత
- అలా చేయమని ఆదేశాలు మీరే ఇచ్చారా..?
- కేసీఆర్ పై సిట్ ప్రశ్నల వర్షం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆదివారం సుదీర్ఘంగా విచారించింది. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన విచారణ సుమారు నాలుగు గంటల 50 నిమిషాల పాటు కొనసాగింది. ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరి నుంచి వచ్చాయి, ఆ పరికరాలు ఎక్కడి నుంచి తెప్పించారన్న అంశాలపై సిట్ అధికారులు కేసీఆర్‌ను వివిధ కోణాల్లో ప్రశ్నించారు. గతంలో అరెస్టయిన అధికారులు, నేతలు ఇచ్చిన వాంగ్మూలాలను ఆయన ముందు ఉంచి వివరణ కోరినట్లు సమాచారం. ఈ విచారణలో “పెద్దాయన ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగింది” అన్న పలువురు పోలీస్ అధికారుల వాంగ్మూలాలే కీలకంగా మారాయి. ప్రభాకర్ రావు నియామకంలో మీ పాత్ర ఏమిటి, ట్యాపింగ్ ప్రక్రియపై మీకు ఎంతవరకు సమాచారం ఉందన్న అంశాలపై సిట్ ప్రశ్నల వర్షం కురిపించింది. కేసీఆర్ ఇచ్చిన సమాధానాలను సిట్ అధికారులు పూర్తిగా రికార్డు చేయగా, విచారణ వివరాలను త్వరలో హైకోర్టుకు సమర్పించనున్నారు. విచారణ మొత్తం వీడియో రూపంలో రికార్డు చేసినట్లు తెలిసింది.

**కేసీఆర్ భావోద్వేగం..**

విచారణ సందర్భంగా కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారని సమాచారం. రాష్ట్ర సాధన కోసం వ్యూహాలు రచించిన అదే గదిలో నిందితుడిగా విచారణ ఎదుర్కోవాల్సి రావడం బాధ కలిగించిందని ఆయన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. విచారణ సమయంలో ఆయన వెంట మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావు ఇంట్లోనే ఉండగా, విచారణ గదిలోకి న్యాయవాదిని కూడా అనుమతించలేదు.

**అట్టుడికిన నగరం...**

ఇదిలా ఉండగా కేసీఆర్ విచారణను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు హైదరాబాద్‌లో ఆందోళనలకు దిగారు. తెలంగాణ భవన్, మంత్రుల క్వార్టర్స్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి విభాగం నాయకులు నల్లజెండాలతో నిరసన చేపట్టగా, పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసీఆర్ నివాసం చుట్టూ నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేయగా, నగరవ్యాప్తంగా బందోబస్తును కట్టుదిట్టం చేశారు.



## జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు

- 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రదానం

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డును 2025 సంవత్సరానికి గాను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రకటించింది. దేశంలో అనేక చారిత్రాత్మక తీర్పులు వెలువరించిన న్యాయవేత్తగా ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకట రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్ లోని అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యాలయం, రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో అవార్డు ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డును అందజేస్తారని తెలిపారు. ఈసందర్భంగా “భారత రాజ్యాంగంభావప్రకటన స్వేచ్ఛ” అనే అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్మారకోపన్యాసం చేయనున్నారని తెలిపారు. ఈ అవార్డుకు సంబంధించిన వివరాలను శనివారం హైదరాబాద్ మఖ్దూంభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈసందర్భంగా కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, భుక్తి కోసమే కాకుండా రెండువందల ఏళ్లకు పైగా కొనసాగిన నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన మహోన్నత పోరాటమని తెలిపారు. ఆ పోరాట ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనమైందన్నారు. ఆ పోరాట యోధుల త్యాగాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో రావి నారాయణరెడ్డి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ను స్థాపించారని చెప్పారు. ఆయన మరణానంతరం ఆ ఆశయాలను కొనసాగిస్తూ 1999 నుంచి స్మారకోపన్యాసాలు, జాతీయ అవార్డుల ప్రదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

# రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునే కుట్ర

- అందుకే బడ్జెట్ లో తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తామంతా ఢిల్లీ వెళ్లి ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ, ఒక్క విన్నపాన్ని కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు మొండి చెయ్యి చూపడానికి కారణమేంటనీ ప్రశ్నించారు. తెలంగాణ ఏం తప్పు చేసిందంటూ నిలదీశారు. ఆదివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ, , మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుల కోసం కేంద్రం నుండి భారీగా నిధులు అందుతాయని ఆశించామన్నారు. మూసీ పునరుజ్జీవం కోసం కేంద్ర సాయం కోరినప్పటికీ బడ్జెట్‌లో దాని ఊసే లేదన్నారు. హైదరాబాద్ ప్రపంచానికే ఫార్మా హబ్‌గా ఉన్నప్పటికీ, కేంద్రం ప్రకటించిన కెమికల్ పార్కుల జాబితాలో తెలంగాణకు చోటు కల్పించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఈసీఐఎల్ వంటి దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చామన్న ఆయన ప్రస్తుత ప్రభుత్వం ఉన్నవాటిని కూడా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రం ఈ విభాగంలోనూ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని విమర్శించారు. అఫోర్డబుల్ స్పోర్ట్స్ గూడ్స్ గురించి విజన్ డాక్యుమెంట్‌లో తెలంగాణ గురించి ప్రముఖంగా చెప్పినా, బడ్జెట్ కేటాయింపుల్లో ఎక్కడా కనిపించలేదన్నారు. హైదరాబాద్ సెంట్రిక్‌గా ఉండాల్సిన ‘ఆరెంజ్ ఎకానమీ’ని కూడా బాంబేకి తరలించడం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి పరాకాష్ట అన్నారు. రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, కృష్ణాగోదావరి నదుల తీరంలో అద్భుతమైన దేవాలయాలు, అటవీ సంపద ఉన్నా తెలంగాణ టూరిజాన్ని కేంద్రం పూర్తిగా విస్మరించిందని భట్టి ఆరోపించారు. కేంద్రం 2047 లక్ష్య సాధనలో తాము కూడా భాగస్వామ్యం కావాలని అనుకున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దామని భట్టి పిలుపునిచ్చారు.

# స్థిరమైన ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

- తెలంగాణకు కూడా గణనీయ లాభాలు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగా ముందుకు నడిపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు రూపకల్పన చేసిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆశాజనకంగా ఉందని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్ పరిమాణం పెరిగిందని చెప్పారు. ఈ బడ్జెట్ ద్వారా తెలంగాణకు కూడా అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వివరించారు. ఎరువులపై రాయితీ పెరగడంతో రాష్ట్ర రైతులకు లాభం చేకూరుతుందని, కాకతీయ వస్త్ర పార్కుకు ప్రయోజనం కలిగించే పథకాలను కేంద్రం తీసుకువచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలనే నిర్ణయంతో తెలంగాణలోని 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు కానున్నాయని తెలిపారు. రైల్వే బడ్జెట్‌ను రెండు లక్షల డెబ్బై ఏడు వేల కోట్ల రూపాయలకు పెంచినట్లు వెల్లడిస్తూ, రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని చెప్పారు. డేటా కేంద్రాలకు ఇచ్చే ప్రోత్సాహంతో తెలంగాణకు గణనీయ లాభం ఉంటుందని, విదేశీ విద్యపై పన్ను తగ్గించడంతో తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మెట్రో రైలు బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావన ఉండదని, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా నిధులు మంజూరు అవుతాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు పెరిగాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రెండు సంవత్సరాలుగా సీరియల్ నడిపిస్తున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. తన ఫోన్ ట్యాప్ అయినట్లు తనకు ఎలాంటి నోటీసులు రాలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంకెంత కాలం దర్యాప్తు కొనసాగిస్తారని ప్రశ్నించారు.

# తెలంగాణలో రియల్ భూం

- భారీగా పెరిగిన భూముల ధరలు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం
- ఒక్క డిసెంబర్ నెలలోనే రూ.1,391.30 కోట్లు
- గత నెల 15 నాటికే రూ.11,957 కోట్ల రాబడి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరోసారి పుంజుకుంటోంది. హైదరాబాద్ పట్టణంతోపాటు శివారు ప్రాంతాలు, జిల్లాల్లోనూ ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరంలో ఒక్క డిసెంబరు నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.1,391.30 కోట్ల ఆదాయం సమకూరింది. ఇప్పటివరకు నమోదైన రాబడిలో మే నెలలో వచ్చిన రూ.1, 390కోట్లు అధికం కాగా తాజాగా డిసెంబరులో ఆ రికార్డును అధిగమించింది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రికార్డులను కూడా అధిగమించి అత్యధిక రాబడిని నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికే రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అత్యధిక రాబడి 202223లో రూ.11,806.34 కోట్లు కాగా.. ఆ రికార్డు ఇప్పుడు తుడిచి పెట్టుకుపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 13.42 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు. 202223లో 16.12 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినwప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం వచ్చినంత రాబడి అప్పుడు రాలేదు. అప్పట్లో భూముల ధరలు తక్కువగా ఉండటమే దీనికి కారణమని చెప్పవచ్చు. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పెరగడంతోపాటు హైదరాబాద్ శివారు, చుట్టుపక్కల జిల్లాల్లో ఖరీదైన భూముల రిజిస్ట్రేషన్లు అధికమవడమే ఆదాయం పెరగటానికి కారణమని రిజిస్ట్రేషన్ల వర్గాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.



# సినీ నటుడు రఘునాథ రెడ్డి కన్నుమూత

- 350కి పైగా చిత్రాల్లో నటించిన రఘునాథ రెడ్డి గుండెపోటుతో మృతి

**ముద్ర, కాప్రా :**



తెలుగు సినిమా పరిశ్రమ మరో సీనియర్ కళాకారుడిని కోల్పోయింది. సుమారు 350కు పైగా చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ సినీ నటుడు కాలకోట రఘునాథ రెడ్డి గుండెపోటుతో మంగళవారం రాత్రి కన్నుమూశారు. కాప్రా డివిజన్ పరిధిలోని ప్రథమపురి కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ప్రాణాలు విడిచారు రఘునాథ రెడ్డి తన సినీ ప్రయాణంలో కలిసుందాం రా, ఒసేయ్ రాములమ్మ, ఇంద్ర, డాన్, తమ్ముడు వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.

# వివేకానంద మానవ వికాస కేంద్రం ప్రారంభం

- రూ.8.5 కోట్లతో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు


**ముద్ర, అమరావతి :**

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో రూ.8.5 కోట్ల వ్యయంతో నిర్మించిన వివేకానంద మానవ వికాస కేంద్రాన్ని ఆదివారం ఉదయం స్వామి గౌతమానందజీ మహరాజ్ ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆరు అంతస్తులుగా నిర్మించిన ఈ కేంద్రంలో బుక్ స్టాల్, కార్యాలయాలు, అతిథి గదులు వంటి ఆధునిక వసతులు ఉన్నాయి. యువతలో వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు యువ సమ్మేళనం, ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
క్రీడలు
Sports

ప్రపంచంలోని 10 అరుదైన మొక్కలు

మిడిల్‌మిస్ట్ రెడ్ : ప్రపంచంలో కేవలం రెండు చోట్ల మాత్రమే ఉంది. అత్యంత అరుదైన పువ్వులలో ఒకటి.



# సంజూ శాంసన్‌కు ఎదురుదెబ్బ



- టీ20 ఓపెనర్ రేసులో ఇషాన్ కిషన్‌కు మేనేజ్‌మెంట్ గ్రీన్ సిగ్నల్

ముద్ర, స్పోర్ట్స్

టీమిండియా వికెట్‌కీపర్-బ్యాటర్ సంజూ శాంసన్ భవితవ్యం మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లకు ఐదు విఫలమవడంతో ఓపెనర్‌గా సంజూ ప్రయాణానికి బ్రేక్ పడినట్టే కనిపిస్తోంది. అదే సమయంలో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఇషాన్ కిషన్ తన స్థానాన్ని మరింత బలంగా నిలబెట్టుకున్నాడు. రాబోయే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026ను దృష్టిలో పెట్టుకుని, టీమిండియా ఓపెనర్ కమ్ వికెట్‌కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను కొనసాగించాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్టు సమాచారం.

తిరువనంతపురం టీ20కి ముందే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. దానికి తగ్గట్టుగానే ఆ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ అద్భుత శతకం బాదుతూ తన ఎంపికను సమర్థించుకున్నాడు. దీంతో తొలి నాలుగు మ్యాచ్‌ల్లో వికెట్‌కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించిన సంజూ శాంసన్, చివరి మ్యాచ్‌లో మాత్రం ఫీల్డింగ్‌కే పరిమితమయ్యాడు. బ్యాటింగ్‌లో దూకుడు చూపిన ఇషాన్‌కు వికెట్‌కీపింగ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా అతడికి మేనేజ్‌మెంట్ స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లైంది. ఇక గాయంతో జట్టుకు దూరంగా ఉన్న తిలక్ వర్మ అందుబాటులోకి వస్తే, సంజూ శాంసన్ తుది జట్టులో చోటు కోల్పోయి బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పుడు అతడు 12వ ఆటగాడిగా వాటర్ బాటిళ్లు మోయడం, సబ్‌స్టిట్యూట్ ఫీల్డింగ్ చేయడం వంటి పాత్రలకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఎవరైనా బ్యాటర్ గాయపడితేనే సంజూకు తుది జట్టులో అవకాశం దక్కే పరిస్థితి ఏర్పడుతోంది. సంజూ శాంసన్‌కు ఇలాంటి పరిస్థితులు కొత్తేమీ కాదు. గతంలో కూడా కీలక దశల్లో అవకాశాలు చేజార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. 2024 టీ20 ప్రపంచకప్‌లో జట్టు సభ్యుడిగా ఎంపికైనప్పటికీ, రిషభ్ పంత్‌కు బ్యాకప్ వికెట్‌కీపర్‌గా మాత్రమే కొనసాగి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం దక్కలేదు. అదనపు బౌలింగ్ ఆప్షన్ అవసరం పేరుతో అతడిని పక్కన పెట్టారు.

రోహిత్ శర్మ రిటైర్మెంట్ అనంతరం ఓపెనర్‌గా ప్రమోషన్ పొందిన సంజూ, ఆ దశలో వరుస శతకాలతో తన సత్తా చాటాడు. అయితే ఆ తర్వాత కొన్ని విఫలాలు ఎదురుకావడంతో పాటు శుభ్‌మన్ గిల్ జట్టులోకి తిరిగి రావడంతో సంజూను మిడిలార్డర్‌కు డిమోట్ చేశారు. దీంతో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న అతడు వరుసగా విఫలమై తుది జట్టులో తన స్థానం కోల్పోయాడు. ఫినిషర్ పాత్ర కోసం మేనేజ్‌మెంట్ జితేష్ శర్మతో ప్రయోగాలు చేసింది.

తర్వాత శుభ్‌మన్ గిల్ కూడా ఫామ్ కోల్పోవడంతో సంజూకు మరోసారి అవకాశం లభించగా, హాఫ్ సెంచరీతో స్పందించాడు. కానీ మెగా టోర్నీకి ముందు కీలకమైన న్యూజిలాండ్ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లో విఫలమవడం, గాయంతో దూరమైన తిలక్ వర్మ స్థానంలో వచ్చిన ఇషాన్ కిషన్ అసాధారణ ప్రదర్శన చేయడం సంజూ అవకాశాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలోనే నెటిజన్లు సంజూ శాంసన్ దురదృష్టంపై చర్చ మొదలుపెట్టారు. కీలక సమయంలో అవకాశాలు చేజారిపోవడం అతడిని మరింత వెనక్కి నెట్టేస్తోందని, అతడు అత్యంత దురదృష్టవంతుడైన క్రికెటర్‌గా మారాడని సోషల్ మీడియాలో వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి.

## హైటెన్షన్ మ్యాచ్‌లో పాక్ బౌలర్ అతి

- వేదాంత్ త్రివేదిపై బంతి విసిరిన మొహమ్మద్ సయ్యమ్

ముద్ర, స్పోర్ట్స్



అండర్-19 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరుగుతున్న హైఓల్టేజ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ యువ బౌలర్ మొహమ్మద్ సయ్యమ్ ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. భారత బ్యాటర్ వేదాంత్ త్రివేదిపై అతడు అత్యుత్సాహం ప్రదర్శించడంతో మైదానంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తన బౌలింగ్‌కు భారీ సిక్సర్ బాదిన ఆగ్రహంతో సయ్యమ్ బంతిని వేదాంత్ వైపు విసిరేయడం గమనార్హం.

ఈ అనూహ్య ఘటనతో వేదాంత్ త్రివేది క్షణకాలం అసహనానికి గురైనప్పటికీ, సంయమనంతో వ్యవహరించాడు. ఎలాంటి ప్రతిస్పందన ఇవ్వకుండా సీరియస్ లుక్‌తోనే నిలిచిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాక్ బౌలర్ తీరుపై భారత నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైదానంలో యువ క్రికెటర్లు ఇలాంటి ప్రవర్తనకు దూరంగా ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మ్యాచ్ విషయానికి వస్తే, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు వైభవ్ సూర్యవంశీ దూకుడైన ఆరంభం అందించాడు. ఐదు ఫోర్లు, ఒక భారీ సిక్సర్‌తో స్కోరును వేగంగా ముందుకు నడిపించాడు. మొహమ్మద్ సయ్యమ్ వేసిన ఎనిమిదో ఓవర్‌లో వైభవ్‌కు ఒకే బంతిపై రెండు సార్లు లైఫ్ దక్కడం మ్యాచ్‌లో ఆసక్తికర ఘట్టంగా నిలిచింది. మూడో బంతికి ఇచ్చిన క్యాచ్‌ను పాక్ ఫీల్డర్ వదిలేయగా, అదే సమయంలో వచ్చిన రనౌట్ అవకాశం కూడా చేజారిపోయింది. అయితే ఆ అవకాశాలను వైభవ్ పూర్తిగా ఉపయోగించుకోలేకపోయాడు. మరుసటి బంతికే కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. దీంతో 47 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే క్రీజులోకి వచ్చిన ఆయుష్ మాత్రే ఖాతా తెరవకుండానే కీపర్ చేతికి చిక్కి డకౌట్ అయ్యాడు. తదుపరి ఓవర్ తొలి బంతికే మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్‌ను క్లీన్ బౌల్డ్ చేయడంతో సయ్యమ్ సంచలనం సృష్టించాడు.

ఈ క్రమంలో కేవలం నాలుగు బంతుల వ్యవధిలో భారత్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. 47 పరుగులకే టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో మ్యాచ్ ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారింది. మైదానంలో చోటుచేసుకున్న ఈ సంఘటనలు భారత్-పాకిస్థాన్ అండర్-19 పోరుకు మరింత హైటెన్షన్‌ను జోడించాయి.

## టీ20 ప్రపంచకప్‌కు శ్రీకాంత్ ప్లేయింగ్ 11
## శాంసన్, కుల్దీప్‌కు చోటు లేదు

ముద్ర, స్పోర్ట్స్

టీ20 ప్రపంచకప్ 2026కు మరికొద్ది రోజులు మాత్రమే ఉండటంతో టీమిండియా తుది కూర్పుపై చర్చ మొదలైంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను 4-1తో గెలిచి మంచి ఊపులో ఉన్న భారత్, ప్రపంచకప్‌లో ఏ ప్లేయింగ్ 11తో బరిలోకి దిగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

శ్రీకాంత్ ఎంపిక చేసిన జట్టులో సంజూ శాంసన్‌కు స్థానం దక్కలేదు. న్యూజిలాండ్ సిరీస్‌లో శాంసన్ ప్రభావం చూపలేకపోవడమే దీనికి కారణంగా ఆయన అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లను ఎంపిక చేశారు. ఇటీవల ఇషాన్ అద్భుత ఫామ్‌లో కొనసాగుతూ భారీ పరుగులు సాధించడం అతడికి కలిసి వచ్చింది.

మిడిల్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్‌లపై శ్రీకాంత్ నమ్మకం ఉంచారు. ఆల్‌రౌండర్లుగా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్‌లను తీసుకున్నారు. బౌలింగ్ విభాగంలో వరుణ్ చక్రవర్తికి ఏకైక స్పిన్నర్‌గా అవకాశం ఇచ్చి, కుల్దీప్ యాదవ్‌ను పక్కన పెట్టారు. పేస్ బాధ్యతలు అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రాకు అప్పగించారు.


**శ్రీకాంత్ ఎంపిక చేసిన టీమిండియా ప్లేయింగ్ 11:**
సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.



## కేంద్ర బడ్జెట్‌లో ఖేలో ఇండియా మిషన్

- దిగువ స్థాయిలో క్రీడలకు కొత్త ఊపు

ముద్ర, స్పోర్ట్స్




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ భారత క్రీడారంగానికి కీలక ప్రకటన చేశారు. అట్టడుగు స్థాయి నుంచి క్రీడా ప్రతిభను పెంపొందించాలనే లక్ష్యంతో 'ఖేలో ఇండియా మిషన్'ను ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. రాబోయే పదేళ్లలో క్రీడా శిక్షణ, మౌలిక సదుపాయాలు, కోచింగ్ వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని తెలిపారు.

ఇప్పటికే అమల్లో ఉన్న ఖేలో ఇండియా కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రతిభ గుర్తింపు నుంచి అంతర్జాతీయ స్థాయి విజయాల దాకా ఒకే దిశలో క్రీడాకారులను తీర్చిదిద్దేలా ఈ మిషన్ రూపొందించనున్నారు. దేశవ్యాప్తంగా శిక్షణ కేంద్రాలను క్రమబద్ధంగా అభివృద్ధి చేయడం, కోచులు-సహాయక సిబ్బందికి శాస్త్రీయ శిక్షణ ఇవ్వడం, క్రీడా విజ్ఞానం-సాంకేతికతను సమన్వయం చేయడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని మంత్రి వివరించారు. అదేవిధంగా క్రీడా సంస్కృతి విస్తరణకు పోటీలు, లీగ్‌ల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ, పోటీలకు అవసరమైన క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా ఈ ప్రణాళికలో భాగంగా ఉంటుందని స్పష్టం చేశారు.

క్రీడా సామగ్రి తయారీలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదగగల అవకాశాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకోసం క్రీడా పరికరాల తయారీకి ప్రత్యేక చొరవను ప్రతిపాదించినట్టు తెలిపారు. డిజైన్, మెటీరియల్ సైన్స్ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

ఇక కోచుల అభివృద్ధిపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పుల్లెల గోపీచంద్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ సూచనల మేరకు, కోచుల కోసం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని అమలు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు వెల్లడైంది. దీని ద్వారా భవిష్యత్తులో భారత్ ఒలింపిక్, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించే అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహణ దిశగా భారత్ అడుగులు వేస్తున్న తరుణంలో, ఖేలో ఇండియా మిషన్ భారత క్రీడల భవిష్యత్తుకు కీలక మైలురాయిగా నిలవనుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## జొకోవిచ్‌పై ఘన విజయం:
## ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా అల్కరాజ్

ముద్ర, స్పోర్ట్స్

స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ టెన్నిస్ చరిత్రలో మరో కీలక ఘట్టాన్ని నమోదు చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో అనుభవజ్ఞుడు నొవాక్ జొకోవిచ్‌ను ఓడించి తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మెల్బోర్న్ పార్క్ వేదికగా జరిగిన ఫైనల్లో అల్కరాజ్ 26, 62, 63, 75తో విజయం సాధించాడు.

ఈ గెలుపుతో 22 ఏళ్ల అల్కరాజ్ కెరీర్ గ్రాండ్ స్లామ్‌ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ తర్వాత ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను కూడా గెలుచుకొని నాలుగు గ్రాండ్ స్లామ్‌లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొమ్మిదో పురుష ఆటగాడిగా అతను నిలిచాడు.

ఫైనల్ ఆరంభంలో జొకోవిచ్ ఆధిపత్యం చూపించాడు. తొలి సెట్‌ను సులువుగా దక్కించుకున్నాడు. అయితే రెండో సెట్ నుంచి అల్కరాజ్ ఆట పూర్తిగా మారింది. వేగవంతమైన కదలికలు, కచ్చితమైన డ్రాప్ షాట్లతో మ్యాచ్‌పై పట్టుబిగించాడు. వరుసగా రెండో, మూడో సెట్లను గెలుచుకొని ఆధిక్యంలోకి వచ్చాడు.

నాలుగో సెట్‌లో జొకోవిచ్ పోరాడినప్పటికీ, కీలక దశలో చేసిన పొరపాటు మ్యాచ్‌ను అల్కరాజ్ వైపు తిప్పింది. చివరి గేమ్‌లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అల్కరాజ్ చాంపియన్‌షిప్ పాయింట్‌ను కన్వర్ట్ చేసి ట్రోఫీని ముద్దాడాడు.

ఈ విజయం టెన్నిస్‌లో కొత్త తరం ఆధిపత్యానికి సంకేతంగా మారింది. అల్కరాజ్‌తో పాటు జానిక్ సిన్నర్ వంటి యువ ఆటగాళ్లు ప్రపంచ టెన్నిస్‌ను ముందుకు నడిపిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## అండర్-19 వరల్డ్‌కప్‌లోనూ నో షేక్‌హ్యాండ్

ముద్ర, స్పోర్ట్స్




ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో భాగంగా ఇవాళ జరిగిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభంలోనే వివాదాస్పద ఘటన చోటుచేసుకుంది. టాస్ సందర్భంగా ఇరు జట్ల కెప్టెన్లు పరస్పరం షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా దూరంగా నిలవడం చర్చనీయాంశంగా మారింది.

టాస్ గెలిచిన పాకిస్థాన్ జట్టు భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే టాస్ ప్రక్రియ పూర్తైన అనంతరం భారత కెప్టెన్ ఆయుష్ మాత్రే, పాకిస్థాన్ కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్‌లు ఆటగాళ్ల జాబితాను పరస్పరం మార్పిడి చేసుకున్నప్పటికీ, సంప్రదాయంగా జరిగే కరచాలనాన్ని పాటించలేదు. ఈ దృశ్యం మైదానంలోనే కాకుండా ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని రేకెత్తించింది.

ఇటీవల కాలంలో భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం క్రీడా వేదికలపై కూడా కనిపిస్తున్నట్లు ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. సీనియర్ క్రికెట్‌లోనూ ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆసియా కప్ సందర్భంగా భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పాకిస్థాన్ కెప్టెన్‌తో షేక్‌హ్యాండ్ ఇవ్వని ఘటన అప్పట్లో విస్తృత చర్చకు దారితీసింది.

అప్పటి నుంచి ఇండో-పాక్ మ్యాచ్‌లలో ఇరు జట్ల కెప్టెన్లు కరచాలనం ఇవ్వకపోవడం పరిపాటిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో జరిగిన భారత్ ఏ-పాకిస్థాన్ ఏ మ్యాచ్‌లోనూ ఇరు జట్ల కెప్టెన్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. సీనియర్ ఆటగాళ్ల వైఖరినే యువ క్రికెటర్లు అనుసరిస్తున్నట్లు అండర్-19 వరల్డ్‌కప్ మ్యాచ్‌లోనూ అదే పరిస్థితి రిపీట్ కావడం గమనార్హం. క్రీడలను క్రీడలుగానే చూడాలన్న అభిప్రాయం ఒకవైపు వినిపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నట్లు ఈ ఘటన సూచిస్తోంది.

## టీ20ల్లో భారత్ అగ్రస్థానం

- న్యూజిలాండ్‌పై సిరీస్ విజయంతో ప్రపంచకప్‌కు గట్టి సంకేతం

ముద్ర, స్పోర్ట్స్

న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 3-2తో కైవసం చేసుకుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026కు ముందు భారత జట్టు అన్ని విభాగాల్లో తన సత్తా చాటుతూ ఆత్మవిశ్వాసం పెంచుకుంది. బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్‌లో వైవిధ్యం, ఫీల్డింగ్‌లో చురుకుదనం చూపిస్తూ జట్టు మేనేజ్‌మెంట్ చేసిన ప్రయోగాలు ఫలితాన్నిచ్చాయి.

సిరీస్‌లో ఒక మ్యాచ్‌లో ఎదురైన పరాజయానికి విశాఖపట్నం వేదికగా జరిగిన తదుపరి మ్యాచ్‌లో భారత్ బలమైన సమాధానం ఇచ్చింది. నిర్ణాయక మ్యాచ్‌లో బ్యాటర్లు విరుచుకుపడగా, భారీ స్కోర్‌తో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. చివరి టీ20లో భారత్ 271 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసి, న్యూజిలాండ్‌ను 225 పరుగులకే పరిమితం చేసింది. దీంతో 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

ఈ సిరీస్‌లో భారత బ్యాటింగ్ విభాగం రికార్డుల మోత మోగించింది. మొత్తం 69 సిక్సర్లు బాదడంతో, ఇంతకుముందు ఇంగ్లాండ్ పేరిట ఉన్న 64 సిక్సర్ల రికార్డును అధిగమించింది. అంతేకాదు, అంతర్జాతీయ టీ20ల్లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఘనతను కూడా భారత్ మరోసారి నమోదు చేసింది.




మొత్తంగా ఈ సిరీస్ విజయం ద్వారా టీమిండియా టీ20 ఫార్మాట్‌లో నంబర్ వన్ జట్టుగా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంది. ప్రపంచకప్‌కు ముందు జట్టు సమతూకం, ఆటగాళ్ల ఫామ్, బెంచ్ బలం అన్నీ పాజిటివ్ సంకేతాలు ఇవ్వడంతో భారత అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ప్రపంచంలోని
10 అరుదైన మొక్కలు

ఎన్సెఫలార్టోస్ వుడ్‌యీ : మగ మొక్క మాత్రమే మిగిలి ఉంది. సహజంగా పెరిగే అవకాశం ఇక లేదు.



# కుంభస్థలం కొట్టాల్సిందే..!

**భారీ లక్ష్యాలతో టాలీవుడ్ మెగా ప్రాజెక్టులు**







తెలుగు సినిమా పరిశ్రమ పరిధి ఇప్పుడు దేశ సరిహద్దులు దాటి ప్రపంచ మార్కెట్ వరకు విస్తరించింది. టాలీవుడ్ సినిమాలు గ్లోబల్ స్థాయిలో సాధించిన గుర్తింపుతో, రాబోయే ప్రతి భారీ చిత్రం వెయ్యి కోట్ల వసూళ్లనే లక్ష్యంగా పెట్టుకుంటోంది. రాజమౌళి, సుకుమార్ వంటి దర్శకులు వేసిన బాటలో ఇప్పుడు మరికొందరు స్టార్ హీరోలు, మేకర్లు పాన్ వరల్డ్ కథలతో రంగంలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ప్రొడక్షన్ దశలో ఉన్న సినిమాల జాబితా చూస్తే, బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట ఇప్పటికే మొదలైనట్టే కనిపిస్తోంది.

అత్యంత భారీ అంచనాల మధ్య నిలిచిన ప్రాజెక్టుల్లో మహేష్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి' ముందువరుసలో ఉంది. దాదాపు వెయ్యి కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా, వసూళ్ల పరంగా అదే స్థాయిని దాటే సామర్థ్యం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే తరహాలో ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్', 'సలార్ 2', 'కల్కి 2' చిత్రాలు కూడా పాన్ ఇండియా స్థాయిలో భారీ బిజినెస్ చేసే అవకాశముందని భావిస్తున్నారు. ప్రభాస్‌కు ఏర్పడిన అంతర్జాతీయ మార్కెట్ ఇప్పుడు అతని ప్రతి సినిమాకు వెయ్యి కోట్ల పొటెన్షియల్‌ను తీసుకొస్తోంది.మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్-సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న 'RC17'పై కూడా అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ఈ జంట మళ్లీ కలవడం సినిమాపై భారీ హైప్‌ను తీసుకొచ్చింది. మరోవైపు అల్లు అర్జున్ అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో చేయబోయే ప్రాజెక్టులు బాలీవుడ్ బాక్సాఫీస్‌ను సైతం కదిలించే స్థాయిలో ఉంటాయన్న అంచనాలు ఉన్నాయి. 'పుష్ప' తర్వాత బన్నీకి ఏర్పడిన క్రేజ్ ఈ సినిమాలకు వెయ్యి కోట్ల క్లబ్ దారిని సులభతరం చేయవచ్చని చెప్పొచ్చు. ఇక ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుంది. 'కేజీఎఫ్' తరహా విజువల్ స్కేల్‌కు తారక్ నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు నమోదయ్యే అవకాశాలు లేకపోలేవు. వీటితో పాటు రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది', ప్రభాస్-హను రాఘవపూడి కాంబోలో వస్తున్న 'ఫౌజీ' వంటి చిత్రాలు కూడా బలమైన కథనంతో వస్తే ఊహించని వసూళ్లను సాధించగలవని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ యాక్షన్‌కే పరిమితం కాకుండా విభిన్న జోనర్లలో రూపొందుతుండటం మరో విశేషం.

అయితే వెయ్యి కోట్ల మార్క్‌ను అందుకోవడం స్టార్ ఇమేజ్‌తోనే సాధ్యమయ్యేది కాదు. కంటెంట్‌లో బలం, అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, పక్కా వ్యూహంతో చేసిన గ్లోబల్ మార్కెటింగ్ అన్నీ కలిసి పని చేయాల్సి ఉంటుంది. రాజమౌళి చూపించిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ సినిమాల మేకర్లు అదే స్థాయిలో శ్రమిస్తున్నట్టు కనిపిస్తోంది. మరి ఈ భారీ ప్రాజెక్టుల్లో ఏ చిత్రం ముందుగా ఆ మైలురాయిని దాటుతుందో, టాలీవుడ్ శక్తిని ప్రపంచానికి మరింత బలంగా చాటిచెప్పుతుందో తెలుసుకోవాలంటే ఇంకొంత కాలం వేచిచూడాల్సిందే.

# సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సమంత-రాజ్?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాలో చర్చకు వచ్చింది. నటిగానే కాదు నిర్మాతగా కూడా తనదైన ముద్ర వేస్తున్న సమంత, ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' సినిమాలో నటిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా చేపడుతోంది. నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, దివ్యేందు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఇదిలా ఉంటే, సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో సమంత దర్శకుడు రాజ్ నిడిమోరు కలిసి గద్దెల వద్ద దర్శనం చేసుకున్నట్టుగా కనిపించే ఓ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. పచ్చ చీరలో సమంత, తెల్ల ధోతిలో రాజ్ కనిపిస్తున్న ఈ చిత్రంపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. అయితే ఇది నిజమైన ఫొటో కాదని, ఏఐతో రూపొందించిందని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

# మెగా ఫ్యామిలీలో డబుల్ సెలబ్రేషన్స్



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, ఉపాసన దంపతుల ఇంట ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ దంపతులకు కవలలు పుట్టడంతో కొణిదెల కుటుంబం సంబరాల్లో మునిగిపోయింది. ఈ శుభవార్తను రామ్‌చరణ్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. గతంలో ఉపాసనతో కలిసి దిగిన ఓ ప్రత్యేక ఫొటోను షేర్ చేస్తూ తమ 'డబుల్ హ్యాపీ'ని వ్యక్తం చేశారు.

"మాకు బాబు, పాప జన్మించారన్న విషయం మీతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. కుమారుడు, కుమార్తెతో పాటు ఇప్పటికే ఉన్న కుమార్తెతో మా కుటుంబం మరింత సంపూర్ణమైంది. మా జీవితాల్లో మహిళలే అసలైన శక్తి. ఎల్లప్పుడూ మా వెంట నిలిచిన కుటుంబ సభ్యులు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని చరణ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ దంపతులకు ఇప్పటికే క్లీంకార అనే కుమార్తె ఉన్న సంగతి తెలిసిందే.

ఇక ఉపాసన శనివారం జనవరి 31న కవలలకు జన్మనిచ్చారు. ఈ నేపథ్యంలో చిరంజీవి ముందుగా సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేయగా, ఆదివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారు. "భగవంతుడి దయతో, హనుమాన్ కృపతో మా ఇంట ఒక మగబిడ్డ, ఒక ఆడబిడ్డకు జన్మ లభించింది. ఉపాసనతో పాటు ఇద్దరు పిల్లలు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు. మా కుటుంబానికి శుభం కలగాలని అనేక ప్రాంతాల నుంచి ప్రార్థనలు చేశారు. ఈ శుభవార్తను అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. అభిమానులు ఈ క్షణాలను పండుగలా జరుపుకుంటున్నారు" అని చిరంజీవి తెలిపారు.

# ఆ దర్శకుడి బాటలో వెంకీ అట్లూరి!

సినిమాలకు టైటిళ్లు ఎంపిక చేసే విషయంలో త్రివిక్రమ్ శ్రీనివాస్‌దే ప్రత్యేక శైలి. స్టార్ హీరోల చిత్రాలకైనా సరే, క్లాస్ టచ్ ఉండేలా, కొంత కవిత్వపు పరిమళం కనిపించేలా, ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకునే పేర్లనే ఆయన ఎంచుకుంటారు. 'అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అజ్ఞాతవాసి', 'అరవింద సమేత' వంటి టైటిళ్లు ఆ అభిరుచికి ఉదాహరణలుగా నిలుస్తాయి.

ఇప్పుడు అదే దారిలో యువ దర్శకుడు వెంకీ అట్లూరి అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. త్రివిక్రమ్ స్టైల్‌ను తలపించేలా తన కొత్త చిత్రానికి టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. సన్నాఫ్ సత్యమూర్తిని గుర్తుకు తెచ్చే విధంగా, ఈ సినిమాకు 'విశ్వనాథం అండ్ సన్స్' అనే పేరును వెంకీ ఎంపిక చేసినట్టు సమాచారం.

'లక్కీ భాస్కర్'తో దర్శకుడిగా తన స్థాయిని మరింత పెంచుకున్న వెంకీ అట్లూరి, ఆ తర్వాత తమిళ స్టార్ హీరో సూర్యతో ఒక ఫ్యామిలీ డ్రామాను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఈ కథా నేపథ్యానికి 'విశ్వనాథం అండ్ సన్స్' అనే టైటిల్ బాగా సరిపోతుందని యూనిట్ భావించిందట. త్వరలోనే ఈ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశముందని టాక్.

ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సంస్థతో పాటు త్రివిక్రమ్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సంస్థ కూడా భాగస్వామిగా ఉండటంతో, ఈ ప్రాజెక్ట్‌పై త్రివిక్రమ్ ప్రభావం పరోక్షంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓ ఘన విజయం కోసం కొంతకాలంగా ఎదురుచూస్తున్న సూర్యకు, ఈ ఫ్యామిలీ డ్రామా కీలకమైన మలుపుగా మారుతుందేమో అన్న అంచనాలు ఉన్నాయి. దీనికి ముందుగా సూర్య నుంచి రావాల్సిన మరో చిత్రం ఉన్నప్పటికీ, వెంకీ అట్లూరి దర్శకత్వంలోని ఈ సినిమా మరింత బలంగా కనిపిస్తోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ చిత్రంలో సూర్యను మధ్య వయస్కుడిగా చూపించనున్నారని, అతని కంటే చాలా చిన్న వయసున్న మామిత బైజుతో ప్రేమకథ నడిచేలా పాత్రలను డిజైన్ చేశారని సమాచారం. ఇదే అంశం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వేసవి సీజన్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు తెలుస్తోంది.



# గ్లామర్ డోస్ పెంచిన కేతిక



**కేతిక శర్మ అంటే గ్లామర్‌కు సింప్లిసిటీకి మధ్య ఉన్న పర్‌ఫెక్ట్ బ్యాలెన్స్. అదే ఆమెను సోషల్ మీడియా గుంపులో ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో కూడా స్టైల్‌తో పాటు సహజమైన ఆకర్షణను కలిపి చూపిస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది.**

**తాజాగా షేర్ చేసిన ఫోటో డంప్‌లో కేతిక తన ట్రేడ్‌మార్క్ సాస్‌ను మరోసారి ఫుల్‌గా వదిలింది. వైట్ కలర్ రిబ్‌డ్ క్రాప్ టాప్‌కు లైట్ డెనిమ్ జత చేసి, "సింపుల్‌గా ఉంటేనే హాట్" అన్నట్టుగా లుక్‌ను క్యారీ చేసింది. అతి ఆర్భాటం లేకుండా, కాన్ఫిడెన్స్‌తో వేసిన ఈ స్టైల్ స్టేట్‌మెంట్ చూపులను తనవైపే లాగేస్తోంది.**

**అల్లరి కర్ల్స్‌గా ఒలికే జుట్టు, ఎక్స్‌ప్రెసివ్ పోజ్, బోల్డ్ బ్యాక్‌డ్రాప్—all కలసి ఈ ఫోటోలకు డ్రామా, ఫన్‌ను జోడించాయి. ఇది కేవలం ఫ్యాషన్ మూమెంట్ మాత్రమే కాదు... పూర్తిగా ఒక వైబ్. మినిమల్ మేకప్‌తోనే మ్యాక్సిమమ్ ఎనర్జీ చూపిస్తూ, నిజమైన గ్లామర్ అంటే మెరుపులే కాదు... అటిట్యూడ్ కూడా అని కేతిక మరోసారి ప్రూవ్ చేసింది.**

# పొట్టి గౌనులో జ్యోతి పూర్వాజ్ అరాచకం



మెరూన్ షేడ్ పొట్టి గౌనులో జ్యోతి పూర్వాజ్ కనిపించగానే సోషల్ మీడియా ఉష్ణోగ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. తెల్లని పూల డిజైన్‌తో కూడిన ఈ మినీ డ్రస్ ఆమె అందాన్ని మరింత హాట్‌గా మార్చేసింది. సన్నని స్పాగెట్టి స్ట్రాప్స్, డీప్ వినెక్ లుక్ ఆమె సిల్హౌట్‌ను కిల్లర్ స్టైల్‌లో హైలైట్ చేస్తూ చూపులను తనవైపే లాగేస్తున్నాయి.

ప్రతి ఫ్రేమ్‌లోనూ జ్యోతి పూర్వాజ్ చూపించే ఆత్మవిశ్వాసం లుక్‌కు మరింత మత్తును జోడిస్తోంది. అతి ఆర్భాటం లేని స్టైలింగ్‌తోనే గ్లామర్ డోస్‌ను ఫుల్‌గా పెంచేసింది. కెమెరాను ఎదుర్కొంటూ ఇచ్చిన పోజులు, చూపుల్లో కనిపించే సెన్సువల్ వైబ్ నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. సాఫ్ట్ వేవ్స్‌గా ఒలికే జుట్టు, కళ్లను మరింత ఆకర్షణీయంగా చేసే లైట్ మేకప్, పెదవులపై మెరిసే స్మైల్—ఈ కాంబో మొత్తం కలిసి ఆమె లుక్‌ను వైరల్ మేటీరియల్‌గా మార్చేసింది. కాలర్‌బోన్ దగ్గర కనిపించే చిన్న టాటూ అయితే ఈ లుక్‌కు అదనపు హీట్ ఇచ్చే హైలైట్‌గా మారింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com